

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం ద్వారా ఐదేళ్లలో విద్య కోసం రూ.40 వేల కోట్లు, రైతులకు పెట్టుబడి సాయంగా రూ.50 వేల కోట్లు వెచ్చిస్తూ రైతు కుటుంబాలు, వ్యవసాయ రంగానికి అండగా నిలుస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 18.07.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 87 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# అభివృద్ధికి బ్యాంకులే బలం



- వివిధ వర్గాలకు రూ.3,216 కోట్ల ఆర్థిక చేయూత
- సామాన్యులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- నరసరావుపేట మెగా రుణమేళాలో సీఎం, నిర్మలాసీతారామన్

**నరసరావుపేట (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ప్రజల వద్దకే వెళ్లి రుణాలు అందించటం గర్వకారణమని, బ్యాంకులు రుణాలిచ్చే సంస్థలే కాదని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములన్నారు. రైతు భవిష్యత్తు మార్చడానికి, యువత కలలు నెరవేర్చడానికి, పారిశ్రామికవేత్తల లక్ష్యం నెరవేరడానికి రుణాలు ఎంతో ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. గత వైసీపీ పాలనంతా సమస్యల సుడిగుండమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రానికి తిప్పలు తెచ్చిందని, కూటమి అధికారంలోకి వచ్చాకే ఆ రుణాల్ని కేంద్ర సహకారంతో రీ –షెడ్యూలు చేసి రూ. 1,538 కోట్లు ఆదా చేశామని అన్నారు. పలనాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన మెగా రుణమేళా కార్యక్రమానికి (క్రెడిట్ అవుట్ రీచ్)కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పలనాడు జిల్లాలో 1,03,246 మంది లబ్ధిదారులకు రూ. 3,216 కోట్ల రుణాలను అందజేశారు. ఇందులో భాగంగా 15 వేల మంది డ్వాక్రా మహిళలకు,13,355 మంది పారిశ్రామికవేత్తలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పారిశ్రామికవేత్తలుగా మారడానికి పల్నాడు చిరునామా కావాలి. పలనాడు పౌరుషానికి శక్తివంతమైన ఆయుధం ఇస్తున్నాం. క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహిస్తున్న అందరికీ అభినందనలు. రైతులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు ఇలా అర్హులైన వారందరికీ రుణం అందించటమే లక్ష్యం. మహిళా సాధికారతకు ఈ క్రెడిట్ అవుట్ రీచ్ ద్వారా ప్రయోజనాలు చేకూరతాయి. రెండేళ్ల క్రితం రాష్ట్రం అంతా సమస్యల సుడిగుండంలో ఉంది. ఏపీలో ఆర్థిక విధ్వంసం చేశారు. కేంద్ర సహకారంతో అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఆకాంక్షలు నెరవేరాయి. వీబీజీ రామ్ జీ కింద కేంద్రం నుంచి రూ. 7,707 కోట్లు రాష్ట్రానికి వస్తుంది. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్ గా మార్చేందుకు కేంద్రం రూ. 40 వేల కోట్లు ఆర్థిక సహకారం అందిస్తుంది. ప్రైవేటు పెట్టుబడులతో కలిపి ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మారుస్తాం." అని సీఎం వివరించారు.

**నిర్మలా సీతా రామన్ సంస్కరణల వాది :** "మహిళలందరికీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 10 లక్షల డ్వాక్రా సంఘాలు రూ. 29 వేల కోట్ల పొదుపుతో దేశంలోనే మేటిగా నిలిచాయి. రుణాల రీ పేమెంట్ లో 99. 5 శాతంతో డ్వాక్రా మహిళలు అగ్రస్థానంలో ఉన్నారు. వారందరినీ మహిళా వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం చేపట్టాం. బ్యాంకింగ్ లో నిర్మలా సీతా రామన్ చాలా సంస్కరణలు తీసుకొచ్చారు. నష్టాల్లో ఉన్న చిన్న బ్యాంకులను విలీనం చేసి సమర్థ బ్యాంకింగ్ వ్యవస్థకు దోహదం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ విప్లవం, జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ శ్లాబ్ లను కుదించి పారదర్శక విధానం తెచ్చారు.

మిగతా 2లో...




# సిజేరియన్లకు బ్రేక్.. సహజ ప్రసవాలకు ప్రోత్సాహం



- తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రాధాన్యం.. సిజేరియన్లపై కఠిన నిఘా
- సహజ ప్రసవాల పెంపే ధ్యేయం...వైద్య వ్యవస్థలో కీలక సంస్కరణలు
- అనవసర సిజేరియన్లకు అడ్డుకట్ట.. ఆస్పత్రుల్లో ఆడిటింగ్ తప్పనిసరి
- తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రాధాన్యం... ప్రతి సిజేరియనుకు కారణం చెప్పాల్సిందే
- రాష్ట్రంలో సిజేరియన్ ప్రసవాలను 54% నుంచి 35%కు తగ్గించాలి
- ప్రభుత్వాసుపత్రుల్లో డయాగ్నస్టిక్ పరీక్షల కోసం రద్దీని తగ్గించాలి
- నిర్దిష్ట సమయంలో సీటీ స్కాన్, ఎమ్మారై వంటి పరీక్షలు చెయ్యాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి మహిళా జీవితంలో ప్రసవ వేదన అద్వితీయమైన, అనిర్వచనీయమైన అనుభూతి అని, తద్వారా తల్లీబిడ్డల మధ్య గాఢమైన అనురాగ బంధాలు ఏర్పడతాయని, సహజ ప్రసవాలకు, సిజేరియన్ల మధ్య హస్తమశకాంతరమంత వ్యత్యాసం ఉందని, సిజేరియన్ ఆపరేషన్లు తాత్కాలికంగా ఉపశమనాన్ని కల్పించినా తల్లీబిడ్డలకు అది ప్రయోజనకరం కాదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఎక్కువ శాతంలో జరుగుతోన్న సిజేరియన్లపై మంత్రి తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. సిజేరియన్లు, ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య నిర్ధారణ పరీక్షల నిర్వహణపై సచివాలయంలో శుక్రవారంనాడు మూడు గంటలకు పైగా సంబంధిత ఉన్నతాదికారులతో మంత్రి సుదీర్ఘంగా

మిగతా 3లో...

# పదవి రద్దు బిల్లుకు బ్రేక్



- పీఎం, సీఎంల అనర్హతపై 130వ రాజ్యాంగ సవరణకు తాత్కాలిక నిలుపు
- మరింత అధ్యయనం అవసరమన్న జేపీసీ
- వర్షాకాల సమావేశాల్లో బిల్లు వచ్చే అవకాశాలు కరువు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశ రాజకీయ వ్యవస్థలో అత్యంత కీలకమైన మార్పులకు నాంది పలకాలని భావించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు-2025 ఆమోదానికి తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. ఏదైనా తీవ్రమైన నేరారోపణల కేసులో ప్రధానమంత్రి, రాష్ట్రాల ముఖ్యమంత్రులు అరెస్ట్ అయి, కనీసం ఒక నెల రోజుల పాటు బెయిల్ కూడా పొందలేక జైలులోనే కొనసాగితే.. వారి పదవులు చట్టప్రకారం ఆటోమేటిక్‌గా రద్దయిపోయేలా కేంద్ర ప్రభుత్వం ఈ చారిత్రాత్మక బిల్లును రూపొందించింది. దేశంలో ప్రజాప్రతినిధుల జవాబుదారీతనాన్ని పెంచడానికి, జైలు నుంచే పాలన సాగించే సంస్కృతికి చరమగీతం పాడటానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2025 ఆగస్టులో ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

మిగతా 2లో...

# దేశ అభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర



- రూ.12.56 కోట్లతో ఆధునీకరించిన రైల్వే స్టేషన్ ప్రారంభం
- రైల్వే స్టేషన్లు ఆర్థికాభివృద్ధికి కేంద్రాలుగా మారాలని ఆకాంక్ష
- మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు కోరిన మంత్రి లోకేష్

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ అభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర అని, రైల్వే స్టేషన్ల ద్వారా ఆర్థికాభివృద్ధి జరగాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద ?12.56 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన మంగళగిరి రైల్వేస్టేషన్ ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ గా ప్రారంభించారు. రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... దేశంలో అనేక సంస్థలు ఉన్నాయి. కేవలం ఒకే సంస్థ మొత్తం భారతదేశాన్ని కలుపుతోంది. అదే మన రైల్వే సంస్థ. మన జీవిత ప్రయాణంలో ఎప్పుడో ఒకప్పుడు రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై వేచి చూసి ఉంటారు, రైలు కిటికీలోంచి బయటకు చూసి ఉంటారు లేదా భారతీయ రైల్వేలో ఒక ముఖ్యమైన ప్రయాణం చేసి ఉంటారు. అందుకే భారతీయ రైల్వే కేవలం ఒక వ్యవస్థ మాత్రమే కాదు, అది భారతదేశ జాతీయ సమైక్యత, సమగ్రతకు ఒక గొప్ప సాధనం. దేశ అభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ గారు రైల్వే వ్యవస్థ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు.

**దేశం అభివృద్ధి చెందాలంటే రైల్వేలు అభివృద్ధి చెందాలి :** గతంలో దశాబ్దాల తరబడి భారతీయ రైల్వేలు రద్దీగా ఉండే స్టేషన్లు,

మిగతా 3లో...

# చేనేతలో ఏపీకి నంబర్‌వన్ లక్ష్యం



- పెట్టుబడులకు ప్రభుత్వ అండ : మంత్రి సవిత
- మెగా, మినీ క్లస్టర్లు.. టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుకు వేగం
- భారత్ టెక్స్-2026లో మూడు కీలక ఒప్పందాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** చేనేత రంగంలో దేశంలో ఏపీని నెంబర్ వన్ గా నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. నాలుగు రోజుల పాటు సాగిన భారత్ టెక్స్ 2026లో మూడు ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు.

మిగతా 2లో...

# ఎఫ్‌సీవీ పొగాకు రైతులను ఆదుకోండి

- కేంద్రానికి పి.వి.ఎన్. మాధవ్ విజ్ఞప్తి
- మార్కెటింగ్ స్థిరీకరణ, కొనుగోళ్లు వేగవంతం, ఎగుమతులకు ప్రోత్సాహం కల్పించాలని పీయూష్ గోయల్‌కు లేఖ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా (ఎఫ్‌సీవీ) పొగాకు మార్కెటింగ్‌ను స్థిరీకరించి, పొగాకు రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో దాదాపు లక్ష మంది పొగాకు రైతు కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని

మిగతా 2లో...



# పారదర్శకతంగా అధ్యాపక పోస్టుల భర్తీ



- అధ్యాపక నియామకాల్లో ఉల్లంఘనలు జరిగితే కఠిన చర్యలు: లోకేష్
- 1.90 లక్షల దరఖాస్తుల్లో 1.51 లక్షలకుపైగా అర్హత నిర్ధారణ
- ఇంటర్వ్యూలు సైతం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశం

2 లో

# ఏపీ సంస్కృతికి ఢిల్లీ గ్రీన్‌సిగ్నల్

- ఏపీ ప్రతిపాదనలపై నెల రోజుల్లో సర్క్యులర్ జారీకి హామీ
- రాజమహేంద్రవరం, విజయవాడ, కడపలకు గుడ్‌న్యూస్
- రాష్ట్ర కళలు, సంస్కృతికి పునర్వైభవమే లక్ష్యమన్న మంత్రి దుర్గేష్

2 లో

# ఎల్‌నినోపై పూర్తి అప్రమత్తం




- ప్రాణ, ఆస్తి, పంటల నష్టం నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎస్ సాయిప్రసాద్ ఆదేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి అప్రమత్తతతో పనిచేసి ప్రాణ, ఆస్తి, పంటల నష్టాన్ని పూర్తిగా నివారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైరిస్క్ రైతు సేవా కేంద్రాలు, మండలాలపై ప్రత్యేక దృష్టిసారించి పరిస్థితులను ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. రైతులకు నిరంతరం సాంకేతిక సలహాలు అందిస్తూ ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ కాలపరిమితి పంటలు, డ్రై సోయింగ్‌ను విస్తృతంగా ప్రోత్సహించాలని,

మిగతా 2లో...

## పదవి రద్దు బిల్లుకు బ్రేక్



(మొదటి పేజీ తరువాయి)

దీనిని రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే పూర్తి స్థాయిలో ఆమోదింపజేయాలని ఎన్డీయే ప్రభుత్వం గట్టిగా యోచించినప్పటికీ.. ఈ బిల్లుపై విస్తృత పరిశీలన కోసం ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ దీనికి తక్షణ ఆమోదం తెలపలేదు. ఢిల్లీలోని పార్లమెంట్ అనెక్స్‌లో శుక్రవారం జరిగిన కీలక భేటీలో ముసాయిదా నివేదికపై ఓటింగ్ జరగాల్సి ఉండగా, ఈ బిల్లుపై మరింత లోతైన సంప్రదింపులు, సమగ్రమైన విచారణ అవసరమని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. దీంతో ఈ ప్రతిష్టాత్మక బిల్లు రాబోయే వర్షాకాల సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశాలు పూర్తిగా కనుమరుగయ్యాయని జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఛైర్‌పర్సన్, బీజేపీ ఎంపీ అపరాజిత సారంగి అధికారికంగా స్పష్టం చేశారు.

**వివాదానికి కారణాలివే :** ఈ బిల్లు ఇంతటి సంచలనానికి దారితీయడానికి అందులోని కొన్ని అత్యంత కఠినమైన నిబంధనలే ప్రధాన కారణం. ఈ బిల్లు ప్రకారం 5 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడదగ్గ తీవ్రమైన నేరాలపై ఒక సిట్టింగ్ ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి అరెస్ట్ అయితే.. వారు వరుసగా 30 రోజుల పాటు జైలులో ఉంటే, 31వ రోజు నుండి వారి పదవి ఆటోమేటిక్‌గా రద్దవుతుంది. అయితే ఈ నిబంధనపై ప్రతిపక్షాలు, పలువురు న్యాయ నిపుణులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పీఎంఎల్ఏ, యూఏపీఏ వంటి కఠిన చట్టాల కింద కేంద్ర దర్యాప్తు సంస్థలు రాజకీయ ప్రతికారంతో విపక్ష ముఖ్యమంత్రులను అరెస్ట్ చేయిస్తే, వారికి నెల రోజుల వరకు బెయిల్ రావడం అసాధ్యమని, దీనివల్ల ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేసేందుకు కేంద్రానికి ఒక ఆయుధం దొరుకుతుందని, ఇది భారత సమాఖ్య స్ఫూర్తికే విఘాతమని వారు వాదిస్తున్నారు. ఈ తీవ్ర సవాళ్లను అధిగమించడానికి అపరాజిత సారంగి నేతృత్వంలోని జేపీసీ కొన్ని కీలక సేఫ్ గార్డ్స్ ను కూడా పరిశీలిస్తోంది. ఒకవేళ భవిష్యత్తులో సదరు నేత నిర్దోషిగా తేలితే స్వయంచాలకంగా తిరిగి అదే పదవిని చేపట్టేలా 'సన్‌సెట్ క్లాజ్' చేర్చడం లేదా పదవిని శాశ్వతంగా రద్దు చేయకుండా కోర్టు తీర్పు వచ్చే వరకు కేవలం 'సస్పెన్షన్' లో ఉంచడం వంటి ప్రత్యామ్నాయాలను కమిటీ పరిశీలిస్తోంది. ఏదేమైనప్పటికీ, ఈ బిల్లుపై అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, వివిధ రాజకీయ పక్షాల నుంచి మరింత స్పష్టమైన అభిప్రాయాలను సేకరించాలని కమిటీ నిర్ణయించడంతో, ఈ చారిత్రాత్మక బిల్లు చట్టరూపం దాల్చడానికి మరికొంత కాలం పట్టవచ్చని తెలుస్తోంది.

## ఎల్‌నినోపై పూర్తి అప్రమత్తం



(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యామ్నాయ విత్తనాల నిల్వలను ముందుగానే సిద్ధం చేసి అవసరమైన ప్రాంతాలకు వెంటనే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

వ్యవసాయంతో పాటు పశుసంవర్ధక రంగంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎస్ సూచించారు. తేమలేమితో ఆహారానికి పనికిరాని పంటలను పచ్చిమేతగా వినియోగించాలని, పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా అరికట్టి పశుగ్రాసంగా ఉపయోగించాలని పేర్కొన్నారు. మేత పంటలకు రక్షిత సాగునీరు కల్పించడంతో పాటు మిగులు జిల్లాల నుంచి కొరత జిల్లాలకు పశుగ్రాస రవాణాను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో కనీసం ఒక పశు శిబిరం ఏర్పాటు చేసి పశువులకు తాగునీరు, పశుగ్రాసం, వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

పశుగ్రాస బ్యాంకులు, మొబైల్ వెటర్నరీ సేవలు, జిల్లా స్థాయి అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సీఎస్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో చర్యల అమలుపై నిరంతర సమీక్ష నిర్వహించాలని, రైతులు, పశు పోషకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, పీఆర్ అండ్ ఆర్డీ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్, వ్యవసాయ శాఖ కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్, ఉద్యానవన శాఖ కమిషనర్ శ్రీనివాసులు, రైతు సాధికార సంస్థ సీఈఓ బి. రామారావు, మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, పశుసంవర్ధక శాఖ సంచాలకులు దామోదర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'దేర్ ఆర్ రివర్స్ ఇన్ ది స్కై' చిత్రకళా ప్రదర్శన





**న్యూఢిల్లీ , (జర్నలిస్ట్ ఫైల్ ):** బహుముఖ ప్రజ్ఞాశాలి కళాకారిణి సరుహ కిలారు నిర్వహిస్తున్న సోలో చిత్రకళా ప్రదర్శన "దేర్ ఆర్ రివర్స్ ఇన్ ది స్కై" ప్రివ్యూను ఇస్కాన్ జాతీయ కమ్యూనికేషన్ డైరెక్టర్, ఇస్కాన్ న్యూఢిల్లీ ఉపాధ్యక్షుడు వ్రజేంద్ర నందన్ దాస్ సందర్శించారు. న్యూఢిల్లీలోని త్రివేణి కళా సంగమ్‌లో ఉన్న శ్రీధరాణి ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనకు ఆయన హాజరై కళాఖండాలను పరిశీలించి అభినందనలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి దిలీప్ కిలారు కుమార్తె సరుహ కిలారు రూపొందించిన ఈ ప్రదర్శనకు ప్రియాంశి ఎస్ క్యూరేటర్‌గా వ్యవహరించారు. నీరు, జ్ఞాపకాలు, ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను ప్రతిబింబించే చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించేలా కళను వినియోగించడం అభినందనీయమని పలువురు సందర్శకులు అభిప్రాయపడ్డారు.

ఈ చిత్రకళా ప్రదర్శన జూలై 17 వరకు కొనసాగనుంది. కళాభిమానులు, విద్యార్థులు, చిత్రకారులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రదర్శనను సందర్శిస్తున్నారు. నీటి సంరక్షణ, ప్రకృతి పరిరక్షణ అవసరాన్ని కళాత్మకంగా ఆవిష్కరించిన ఈ ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోంది.

# పారదర్శకతంగా అధ్యాపక పోస్టుల భర్తీ




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో ఫ్యాకల్టీ భర్తీ ప్రక్రియలో విశ్వవిద్యాలయాలు, వైస్ చాన్సలర్లు అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఉన్నత విద్య, స్కిల్ డెవలప్ మెంట్ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి, భర్తీ ప్రక్రియలో ఎటువంటి ఉల్లంఘనలు, ఆరోపణలు తలెత్తినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల పరిధిలో అధ్యాపక పోస్టుల కోసం 1,90,509 అప్లికేషన్లు రాగా, వాటిలో 1,51,836 దరఖాస్తులు అర్హమైనవిగా నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. ఎలిజిబిలిటీకి సంబంధించి గ్రీవెన్స్ ను ఈనెల 21వతేదీ వరకు స్వీకరించి, 27వతేదీన అర్హుల తుదిజాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఇంటర్వ్యూ ప్రక్రియను సైతం పూర్తి పారదర్శకంగా నిర్వహించేలా చూడాలి, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే ప్రైవేటు యూనివర్సిటీల అనుమతులకు సంబంధించి విధివిధానాలు, వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సెట్ల నిర్వహణ పురోగతిపై చర్చిస్తూ... సకాలంలో అడ్మిషన్లు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రైవేటు వర్సిటీలకు అనుమతులు ఇచ్చే సమయంలో యుజిసి నిబంధనలను కచ్చితంగా పాటించాలని స్పష్టంచేశారు.

**జాబ్ మేళాల ద్వారా 1.37లక్షలమందికి ఉద్యోగాలు :** స్కిల్ డెవలప్ మెంట్ శాఖపై మంత్రి సమీక్షిస్తూ... రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1.37లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు లభించాయని తెలిపారు. యువతకు మరింత సౌలభ్యంగా ఉండేలా జాబ్ మేళాలను నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి ఐటిఐని పరిశ్రమలకు అనుసంధానించి, యువత నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా వచ్చే పరిశ్రమలకు అవసరమైన వర్క్‌ఫోర్స్ తయారు, స్కిల్ గ్యాప్ భర్తీపై నిర్మాణాత్మక చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకు సంబంధించి 81 ఆపరేషనలైజ్ ఇండస్ట్రీ అకడమిషియా పార్టనర్ షిప్స్‌ను సిద్ధం చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 23 జిల్లాకేంద్రాల్లో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ ఆధ్వర్యాన రూ.94కోట్లతో ట్రైనింగ్ సెంటర్ల నిర్మాణానికి డిజైన్లు సిద్ధమైనట్లు అధికారులు తెలిపారు. నైపుణ్యం పోర్టల్ ను యువతకు ఉపయోగకరంగా తీర్చిదిద్ది, వచ్చేనెలలో ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులకు ఎన్ రోల్ మెంట్ ఆధారంగా మొదటి సంవత్సరం నుంచే వివిధ ఉద్యోగాలు, వాటికి కావాల్సిన స్కిల్స్ సమాచారం, కెరీర్ గైడెన్స్ వివరాలతో నైపుణ్యం పోర్టల్ ద్వారా అప్ డేట్స్ వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి విద్యార్థికి స్కిల్స్ పై అవగాహన కల్పించడమేగాక ఆన్ లైన్ లో స్కిల్ పాస్ పోర్టు అందిస్తామని తెలిపారు. కళాశాల నుంచి చదువు పూర్తిచేసుకుని బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి ప్లేస్ మెంట్ లభించేలా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి చర్యలు చేపట్టాలి. రాష్ట్రంలో 169 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్లేస్ మెంట్ సెల్స్ ఏర్పాటుచేయాలని సూచించారు. ఫలితాల సాధనే అంతిమ లక్ష్యంగా అధికారులు పనిచేయాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, స్కిల్ డెవలప్ మెంట్ సిఇఓ గణేష్ కుమార్, సీడాప్ సిఇఓ నారాయణస్వామి, ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్. విజయభాస్కర్ పాల్గొన్నారు.

# అభివృద్ధికి బ్యాంకులే బలం

(మొదటి పేజీ తరువాయి)




వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా చాలా సంస్కరణలు కేంద్ర మంత్రి నిర్మల తీసుకొచ్చారు. ఈ తరహా క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాల్ని 6 జిల్లాల్లో నిర్వహించేందుకు తక్షణమే అంగీకరించారు. త్వరలోనే 3 నెలలకు ఒకటి చొప్పున ఈ తరహా కార్యక్రమాలు చేపడతాం." అని ముఖ్యమంత్రి అన్నారు

**చిన్న వ్యాపారులకు అండగా కేంద్రం-కేంద్ర మంత్రి :** దేశంలోని ప్రతి గ్రామంలోనూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. తాను ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి బ్యాంకులు ఎన్‌పీఏల సమస్యలతో ఇబ్బందుల్లో ఉండేవని, చిన్న వ్యాపారులు అప్పులు దొరక్క నష్టపోయేవారని గుర్తుచేశారు. చిన్న వ్యాపారుల ఆర్థిక కష్టాలను గుర్తించిన ప్రధాని మోదీ.. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి బ్యాంకుల ద్వారా వారికి సులభంగా రుణాలు అందేలా పథకాలు తెచ్చారని వివరించారు. నేడు బ్యాంకులు స్వయంగా వ్యాపారుల చెంతకే వచ్చి రుణాలు ఇస్తున్నాయని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మెగా రుణమేళాలో భాగంగా లబ్దిదారులకు ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి రుణ మంజూరు పత్రాలను, చెక్కులను అందజేశారు.

**ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ అందజేత :** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.42.16 లక్షల విలువైన అంబులెన్స్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి అందించారు. అలాగే నాబార్డు సౌజన్యంతో డీసీసీబీ (ఐజజదీ) కి రూ.25 లక్షల విలువైన 2 మొబైల్ డెమో వ్యాన్లు అందించారు. అలాగే విద్యార్థినులకు రూ.17.80 లక్షల విలువైన 301 సైకిళ్లను పంపిణీ చేశారు. పర్యాటక శాఖకు గ్రామీణ బ్యాంక్ తరపున రూ.14 లక్షల విలువైన 2 బ్యాటరీ వాహనాలను అందించారు. వీటిని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, భాష్యం రామకృష్ణ, పలువురు ఎమ్మెల్యేలు, బ్యాంక్ అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. సభకు ముందు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అక్కడ ఏర్పాటు చేసిన ప్రభుత్వ స్టాళ్లను సందర్శించి, నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

# చేనేతలో ఏపీకి నంబర్‌వన్ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)



ఢిల్లీలో జరుగుతున్న భారత్ టెక్స్ 2026లో చివరి రోజైన శుక్రవారం మంత్రి సవిత బిజీగా గడిపారు. ఏపీ చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పనే లక్ష్యంగా పలువురు పెట్టుబడిదారులు, కొనుగోలుదారులతో భేటీ అయ్యారు. హవాక్ గ్రూప్ ఆఫ్ ఎండీ ప్రవీణ్ సంగ్వాన్ తదితర పెట్టుబడిదారులతో మంత్రి సవిత ఏపీలో టెక్స్ టైల్స్ రంగంలో పెట్టుబడుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏపీలో చేనేత, జౌళి రంగ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చామన్నారు. మెగా, మినీ క్లస్టర్లు, టెక్స్‌టైల్స్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి నియోజక వర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, వాటిలో నేతన్నలకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఏపీలో చేనేత రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. చేనేత రంగంలో ఏపీని నెంబర్ వన్ గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. భారత్ టెక్స్ 2026లో ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్ లో స్టాళ్లను పరిశీలించారు.

**3 సంస్థలతో కీలక ఒప్పందాలు :** ఈ నెల 14వ తేదీ నుంచి ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న భారత్ టెక్స్ 2026లో ఏపీ చేనేత, జౌళి శాఖాధికారులు మూడు సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. రాష్ట్రంలో ఆధునిక టెక్స్‌టైల్ రీసైక్లింగ్ ఎకోసిస్టమ్ ఏర్పాటు చేయడానికి తిరువూరుకు చెందిన బీకేఎస్ ఫ్యాబ్రిక్స్ తో అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సంస్థ రాష్ట్రంలో రూ.4 వేల కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. పది ఎకరాల్లో టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. వినియోగానంతర వస్త్ర వ్యర్థాలను శాస్త్రీయంగా సేకరించి, వర్గీకరించి, పునర్వినియోగానికి అనువుగా ఈ యూనిట్ మార్చనుంది. ఈ యూనిట్ ఏర్పాటుతో రాష్ట్రంలో సర్క్యులర్ టెక్స్‌టైల్ ఎకానమీ, పర్యావరణ పరిరక్షణ, వనరుల సమర్థ వినియోగంతో పాటు ఉపాధి అవకాశాలకు ఊతం లభించనుంది. విశాఖలో రూ.100 కోట్లతో ఆధునిక గార్మెంట్ తయారీ యూనిట్ ఏర్పాటుకు మరో ఒప్పందం కుదిరింది. మరో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో గార్మెంట్ రంగంలో పెట్టుబడులు పెరగడంతో పాటు, మూడు వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. చేనేత ఉత్పత్తులకు ఆధునిక మార్కెట్ లభించేలా నాసిక్ కు చెందిన కేప్స్ ఫౌండేషన్ తో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ భాగస్వామ్యం ద్వారా కొత్త డిజైన్ల అభివృద్ధి, మార్కెట్ ధోరణులకు అనుగుణంగా విలువ ఆధారిత ఉత్పత్తుల రూపకల్పనపై చేనేత కార్మికులకు సాంకేతిక సహకారం అందనుంది.

**అంతర్జాతీయ స్థాయికి హస్తకళలు :** శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని బాబా ఖరక్ సింగ్ మార్గ్ లోని ఆధునీకరించిన లేపాక్షి షోరూమ్ ను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏపీ హస్తకళలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా లేపాక్షి షో రూమ్ లను పలు దేశాల్లో ప్రారంభించే ఆలోచన చేస్తున్నామన్నారు. దేశంలోనూ హస్త కళారూపాలకు మార్కెటింగ్ కల్పించడానికి ప్రణాళికులు అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా లేపాక్షి షో రూమ్ లను ఆధునీకరిస్తున్నామన్నారు. కొత్త షో రూమ్ లను ప్రారంభిస్తున్నామన్నారు. నేరుగా ఇళ్లకే హస్త కళారూపాలు పంపేలా సోషల్ మీడియా, ఈ కామర్స్ ద్వారా అమ్మకాలు చేస్తున్నామన్నారు. విదేశాలకు హస్త కళల గిఫ్ట్ బాక్స్ లు సరఫరా చేస్తున్నామన్నారు. సింగపూర్‌లోని భారత రాయబార కార్యాలయానికి 500 హస్తకళారూపాల గిఫ్ట్ బాక్స్ లను, హాంకాంగ్, ఇతర దేశాలకు హస్త కళారూపాలను సరఫరా చేస్తున్నామన్నారు. గతేడాది విశాఖలో జరిగిన జ×× భాగస్వామ్య సదస్సులో పెట్టుబడుదారులకు ఏపీ హస్త కళలతో కూడిన గిఫ్ట్ బాక్స్ లను అందజేశామన్నారు. హస్త కళాకారులకు కేవలం చేతివృత్తిదారులు మాత్రమే కాదని, దేశ సంస్కృతీ సంప్రదాయాలకు రాయబారులు అని కొనియాడారు. హస్త కళాకారులకు 365 రోజులూ ఉపాధి కల్పించాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు మంత్రి సవిత... ఆధునీకరించిన లేపాక్షి షో రూమ్ ను పరిశీలించారు. అక్కడ అమ్మకానికి పెట్టిన హస్త కళారూపాలను తిలకించారు. అమ్మకాలు పెంచేలా కృషి చేయాలని సిబ్బందికి దిశా నిర్దేశంచేశారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్లా, ఏపీహెచ్డీసీ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరి ప్రసాదరావు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, లేపాక్షి ఎండీ ఎం.విశ్వ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ సంస్కృతికి ఢిల్లీ గ్రీన్‌సిగ్నల్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరించడమే ధ్యేయంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ విజయవంతంగా కొనసాగిస్తున్న న్యూఢిల్లీ పర్యటనలో మరో కీలక అడుగు పడింది. రెండో రోజు పర్యటనలో భాగంగా మధ్యాహ్నం కేంద్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శి వివేక్ అగర్వాల్‌తో మంత్రి కందుల దుర్గేష్ కీలక భేటీ అయి ఏపీ సాంస్కృతిక రంగానికి మహర్దశ చేకూర్చే 5 అత్యంత కీలకమైన పెండింగ్ ప్రతిపాదనల నివేదికను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ నిరంతర ప్రత్యేక ఫాలోఅప్ నేపథ్యంలో ఈ ప్రతిపాదనలపై కేంద్ర కార్యదర్శి వివేక్ అగర్వాల్ అత్యంత సానుకూలంగా స్పందించారు. వీటికి అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చి నెల రోజుల్లోనే స్పష్టమైన రూపాన్ని తీసుకువస్తామని, త్వరలోనే అధికారిక సర్క్యులర్‌ను జారీ చేస్తామని మంత్రి కందుల దుర్గేష్‌కు కేంద్ర కార్యదర్శి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ పరిణామాల పట్ల హర్షం వ్యక్తం చేసిన మంత్రి దుర్గేష్ త్వరలోనే రాష్ట్ర సాంస్కృతిక రంగానికి మహర్దశ రాబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

మంత్రి దుర్గేష్ సమర్పించిన ప్రతిపాదనల్లో చారిత్రక, సాంస్కృతిక నగరమైన రాజమహేంద్రవరంలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, రాష్ట్రంలో 'ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్'కేంద్రాన్ని నెలకొల్పడం, ఏపీలో లలిత కళా అకాడమీ ప్రాంతీయ కేంద్రాన్ని స్థాపించడం, విజయవాడ లోని జి.వి.ఆర్ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో అత్యాధునిక 'కళాక్షేత్ర ఆడిటోరియం' నిర్మాణం చేపట్టడం, కడప లో కేంద్ర సాహిత్య అకాడమీ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలు మరియు కళలకు పునర్వైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. తమ విజ్ఞప్తులకు కేంద్రం తక్షణమే స్పందించి, నెల రోజుల్లోనే ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇవ్వడం రాష్ట్ర కళాకారులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.

అంతకుముందు దేశ రాజధానిలో జరుగుతున్న ప్రతిష్టాత్మక "ఫెయిత్ టూరిజం కాన్‌క్లేవ్-2026" లో రెండో రోజు పాల్గొన్న మంత్రి దుర్గేష్ ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ఉన్న అపారమైన పెట్టుబడి అవకాశాలను జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా కాన్‌క్లేవ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏపీ టూరిజం స్టాల్‌ను మంత్రి దుర్గేష్ సందర్శించారు. స్టాల్‌ను సందర్శించిన పలువురు ప్రముఖులకు, సందర్శకులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగ విశిష్టతలను, చారిత్రక, ఆధ్యాత్మిక వైభవాన్ని ఆయన స్వయంగా వివరించారు. ఉదయం సెషన్‌లో భాగంగా మంత్రి కందుల దుర్గేష్ పలువురు జాతీయ, అంతర్జాతీయ పర్యాటక రంగ ప్రతినిధులు, ఇన్వెస్టర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న అనుకూల వాతావరణాన్ని వారికి వివరించి, భాగస్వాములు కావాల్సిందిగా ఆహ్వానించారు. మంత్రి దుర్గేష్ తో పాటు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఏపీ పర్యాటక రంగ పెట్టుబడులపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు.

## ఎఫ్‌సీవీ పొగాకు రైతులను ఆదుకోండి

(మొదటి పేజీ తరువాయి)



ఎదుర్కొంటున్నాయని, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు రైతుల ఆదాయంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎఫ్‌సీవీ పొగాకు రాష్ట్రంలో కీలక వాణిజ్య పంటగా ఉండటమే కాకుండా ఉపాధి, ఎగుమతులు, విదేశీ మారకద్రవ్య ఆదాయానికి ప్రధాన వనరుగా నిలుస్తోందని వివరించారు.

ప్రస్తుత మార్కెటింగ్ సీజన్‌లో సిగరెట్లపై పెరిగిన పన్నులు, అధిక ఉత్పత్తి, అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గిన డిమాండ్, భౌగోళిక-రాజకీయ పరిస్థితులు, కొనుగోలుదారుల భాగస్వామ్యం తగ్గడం వంటి కారణాలతో మార్కెట్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని మాధవ్ తెలిపారు. టొబాకో బోర్డు అనుమతించిన 142 మిలియన్ కిలోల పంటకు బదులుగా సుమారు 232 మిలియన్ కిలోల ఉత్పత్తి నమోదైందని, జూలై 13 నాటికి మొత్తం పంటలో కేవలం 14 నుంచి 15 శాతం మాత్రమే వేలాల ద్వారా విక్రయించబడగా, సుమారు 85 శాతం పంట రైతుల వద్దే నిల్వ ఉందని పేర్కొన్నారు. సగటు వేలం ధర కిలోకు రూ.217.65కు పడిపోవడం, కొనుగోళ్లు మందగించడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలు వేలం కేంద్రాల్లో రైతులు నిరసనలకు దిగిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్‌లో నగదు ప్రవాహాన్ని పెంచడం, దేశీయ కొనుగోలుదారులు, ఎగుమతిదారులను అధిక కొనుగోళ్లకు ప్రోత్సహించడం, ఎగుమతి అవకాశాలను విస్తరించడం, రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా విధానపరమైన చర్యలు చేపట్టాలని మాధవ్ కోరారు. జింబాబ్వే, టాంజానియా, అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు తమ ఎగుమతిదారులకు అందిస్తున్న ప్రోత్సాహకాలతో పోలిస్తే భారతీయ ఎగుమతిదారులకు తగిన మద్దతు లేకపోవడం వల్ల పోటీతత్వం దెబ్బతింటోందని పేర్కొన్నారు. ఎఫ్‌సీవీ పొగాకు మార్కెటింగ్‌ను స్థిరీకరించి, కొనుగోళ్లు వేగవంతం చేయడంతో పాటు ఎగుమతులకు ప్రోత్సాహం అందించి రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యవసరంగా జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నిర్మలా సీతారామన్‌కు స్వాగతం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లా నరసరావుపేటలో శనివారం నిర్వహించనున్న 'మెగా క్రెడిట్ అవుట్‌రీచ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నిర్వహించనున్న అధికారిక కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించిన ఆయన, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మరింత మంది ప్రజలకు చేరువ కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ, నరసరావుపేటలో నిర్వహిస్తున్న మెగా క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం రైతులు, మహిళలు, సూక్ష్మ, చిన్న వ్యాపారవేత్తలు, స్వయం ఉపాధి పొందుతున్న లబ్ధిదారులకు ఆర్థిక బలోపేతాన్ని అందిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్థిక సాధికారత పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

# ఎస్సీ కమిషన్ పర్యటనలో 'ప్రోటోకాల్' మాయం!



- క్యాబినెట్ ర్యాంక్ హోదా ఉన్నా దక్కని అధికారిక గౌరవం
- ప్రైవేట్ లాడ్జిలో బస.. హాస్టల్ నుంచి భోజనాలు
- అధికారుల నిర్లక్ష్యంపై బ్రహ్మంగారిమఠంలో సర్వత్రా విమర్శలు
- సమాధానం దాటవేసినా.. విద్యార్థులతో కలిసి తిని నిరాడంబరత చాటుకున్న కమిషన్

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ )రాష్ట్రంలో అత్యున్నతమైన క్యాబినెట్ ర్యాంక్ హోదా కలిగిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ పర్యటనలో స్థానిక రెవెన్యూ యంత్రాంగం ప్రోటోకాల్‌ను గాలికొదిలేసింది.

ముడుమాల గుండాపురం గ్రామానికి చెందిన యువకుల అనుమానాస్పద మరణాల పట్ల బత్తుల కుటుంబాలను పరామర్శించేందుకు విచ్చేసిన కమిషన్‌కు కనీస మర్యాదలు కల్పించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాజ్యాంగబద్ధమైన ఒక ఉన్నత కమిషన్ పర్యటనను ఇంత నిర్లక్ష్యంగా చూస్తారా అంటూ స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు ముక్కున వేలేసుకుంటున్నాయి.

**అసలేం జరిగిందంటే..?**

ఇటీవల మండలంలో తీవ్ర సంచలనం సృష్టించిన యువకుల జంట మరణాల కేసు నిమిత్తం బాధితుల కుటుంబాలను పరామర్శించడానికి ఎస్సీ కమిషన్ బ్రహ్మంగారిమఠం విచ్చేసింది. బాధితులకు ధైర్యం చెప్పిన అనంతరం వారు వీరబ్రహ్మేంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. అయితే, అధికారిక పర్యటనలో ఉన్న కమిషన్ బస కోసం ప్రభుత్వ అతిథి గృహాన్ని సిద్ధం చేయకపోవడంతో వారు ఒక ప్రైవేట్ లాడ్జిలో విడిది చేయాల్సి వచ్చింది.

అక్కడితో ఆగకుండా, మధ్యాహ్న భోజన సమయానికి కూడా రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి విఐపి భోజన వసతి ఏర్పాట్లు చేయలేదు. కనీసం భోజన మర్యాదలు కూడా లేకపోవడంతో, చివరి నిమిషంలో స్థానిక ఎస్సీ హాస్టల్ (వసతి గృహం) నుండి భోజనం తెప్పించాల్సి వచ్చింది. క్యాబినెట్ హోదా ఉన్న ఒక ఉన్నతాధికారి పర్యటనలో ఇలాంటి ఏర్పాట్లు జరగడంపై స్థానికంగా తీవ్ర చర్చ నడిచింది.

**వర్కింగ్ జర్నలిస్టుల ప్రశ్నకు కమిషన్ నిరాడంబరత..**

ఈ అమానుషమైన ప్రోటోకాల్ లోపంపై 'బ్రహ్మంగారిమఠం వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్' ప్రతినిధులు నేరుగా ఎస్సీ కమిషన్‌ను ప్రశ్నించారు. "మీకు కనీస ప్రోటోకాల్ ఏర్పాట్లు కూడా చేయలేదు సార్.." అని జర్నలిస్టులు ప్రస్తావించగా, కమిషన్ వారు ఎంతో ఓపికగా స్పందిస్తూ, "ఆ విషయం నాకు తెలియదు, అయినా ఇబ్బంది ఏముంది.. కావాలంటే అక్కడికే వెళ్లి తిందాం" అంటూ తమ నిరాడంబరతను చాటుకున్నారు. వెంటనే వారు ప్రైవేట్ లాడ్జి నుంచి బయలుదేరి స్థానిక ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. వారి వెంట వచ్చిన ఆర్డీఓ, డీఎస్పీ, పోలీస్ సిబ్బంది అంతా కలిసి అక్కడే విద్యార్థులతో పాటు సాధారణ భోజనం చేశారు. కమిషన్ వ్యవహరించిన తీరుపై ప్రశంసలు కురుస్తున్నప్పటికీ, వెనుక ఉన్న అధికారుల వైఖరిపై మాత్రం నిప్పులు చెరుగుతున్నారు.

**చట్టం ఏం చెబుతోంది? ఇక్కడ ఏం జరిగింది?**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. క్యాబినెట్ హోదా కలిగిన వ్యక్తులు ఒక ప్రాంతానికి వస్తున్నారంటే వారం రోజుల ముందే సమాచారం అందుతుంది.

**నిబంధనల ప్రకారం**: స్థానిక ఆర్డీఓ మరియు తహశీల్దార్ నేతృత్వంలోని రెవెన్యూ యంత్రాంగం వారికి తగిన వసతి, రవాణా, భద్రతతో పాటు అధికారిక విఐపి భోజన ఏర్పాట్లను పర్యవేక్షించాలి. ఇది సదరు వ్యక్తులకు ఇచ్చే సౌకర్యం కాదు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యాంగ వ్యవస్థకు ఇచ్చే గౌరవం.


**కనిపించిన లోపం :** ఈ పర్యటనలో అధికారుల మధ్య ముందస్తు సమన్వయం పూర్తిగా లోపించింది. ప్రైవేట్ లాడ్జిలో బస కల్పించడం, చివరి నిమిషంలో హాస్టల్ భోజనం తెప్పించుకోవాల్సి రావడం ఖచ్చితంగా ప్రోటోకాల్ నిబంధనల ఉల్లంఘనే అవుతుంది.

**నిర్లక్ష్యం ఎవరిది? :** ఉన్నతాధికారులు, కమిషన్ల పర్యటనల బాధ్యతను పర్యవేక్షించాల్సిన ప్రధాన బాధ్యత స్థానిక రెవెన్యూ (ప్రోటోకాల్) విభాగానిదే. అంతా బాగుంది అనిపించుకోవాల్సిన చోట ఇలాంటి నిర్లక్ష్యపు ధోరణి ప్రదర్శించడం అధికారుల బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది. కమిషన్ సభ్యులే స్వయంగా హాస్టల్‌కు వెళ్లి తిని పెద్ద మనసు చేసుకోవడం సరిపోయింది కానీ లేదంటే జిల్లా యంత్రాంగం సమాధానం చెప్పుకోలేని పరిస్థితి వచ్చేదనడంలో సందేహం లేదు.

రెవెన్యూ యంత్రాంగం పై మండిపడ్డ ఎస్సీ కమిషన్

స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సందర్శించిన అనంతరం వెళ్లే సమయంలో రెవెన్యూ యంత్రాంగం పై ఎస్సీ కమిషన్ కె జవహర్ మండిపడ్డారు. రెవెన్యూ యంత్రాంగం ప్రోటోకాల్ పాటించకపోవడం పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు ఒక మండల మెజిస్ట్రేట్ అయి ఉండి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి గ్రామానికి రావడానికి ఇంత నిర్లక్ష్యం ఏమిటి అని మండిపడ్డారు ప్రోటోకాల్ గురించి తెలియకపోవడం విచారకరమని రిటైర్డ్ విఆర్ఓ లను అడిగి తెలుసుకోవాలని సూచించారు.

# రాష్ట్ర పండుగగా ప్రగడ కోటయ్య జయంతి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: రాష్ట్ర చేనేత రంగ అభివృద్ధికి విశేష సేవలందించిన ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని ఇకపై రాష్ట్ర పండుగగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏడాది జూలై 26న రాష్ట్ర సచివాలయం, జిల్లా కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ఆదేశించింది. చేనేత కార్మికుల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన కోటయ్య సేవలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. నూలు సరఫరా, చేనేత కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు చేపట్టిన ఆయన సహకార నూలు మిల్లులు, చేనేత సహకార సంఘాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన ఆయనను అప్పటి ఉత్తరప్రదేశ్ గవర్నర్ బెజవాడ గోపాలరెడ్డి 'ప్రజాబంధు'గా సత్కరించారు.

ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత-జౌళి శాఖ మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. నేతన్నల ఆత్మగౌరవానికి ప్రాధాన్యం ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రగడ కోటయ్య సేవలకు తగిన గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో పాటు ఈ నిర్ణయం అమలులో కీలక పాత్ర పోషించిన మంత్రి సవితకు నేతన్నలు కృతజ్ఞతలు తెలిపారు.

# సిజేరియన్లకు బ్రేక్.. సహజ ప్రసవాలకు ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షించారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ అసుపత్రుల్లో జరుగుతోన్న మొత్తం ప్రసవాల్లో 51% సిజేరియన్లు జరగడంపై మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. వీటిని మూడేళ్ల (2028-29)లో నాటికి 35%కు తగ్గించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

**సిజేరియన్ శ్రేయస్కరం కాదు** : రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాప్తంగా పెరుగుతోన్న సిజేరియన్ల తీరు, కారణాలపై అధికారులు, ప్రసూతి వైద్య నిపుణులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరింగా చర్చించారు. సహజ ప్రసవం తల్లికి కొంత ఇబ్బందితో కూడినదైనా మాతా, శిశువులకు ఎంతో ప్రయోజనకరమైనదని, సిజేరియన్ ప్రసవం తాత్కాలిక ఉపశమనాన్ని కలిగిస్తుందనే కానీ తల్లీబిడ్డలకు ప్రయోజనకరం కాదని నిపుణులు తెలిపారు. సిజేరియన్ల వల్ల తల్లి ఎక్కువకాలం అసుపత్రుల్లో ఉండాల్సి రావడంతోపాటు పూర్తిగా కోలుకునేందుకు ఎక్కువ సమయం పడుతుందని, చికిత్సకు సంబంధించి సమస్యలు కూడా ఎదురవుతాయని వారు తెలిపారు. మారుతోన్న సామాజిక, ఆర్థిక పరిస్థితులు, సమకాలీన జీవన విధానంతోపాటు వచ్చే ఊబకాయం, బీపీ, షుగర్ వంటి సమస్యలవల, దైనందిన జీవితంలో శ్రమకు దూరమై నొప్పిని భరించే శక్తి తగ్గడం, వైద్య సదుపాయాల లభ్యత వంటి కారణాలవల్ల సిజేరియన్లు రోజురోజుకి పెరుగుతున్నాయని అధికారులు, నిపుణులు వివరించారు. అనివార్య పరిస్థితుల్లో చేపట్టాల్సిన సిజేరియన్లు, అతి సాధారణం కావడంపై మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు.

**సిజేరియన్లలో రాష్ట్రానికి 4వ స్థానం**: దేశం(2025-26)లో 30.13% సిజేరియన్లు జరగ్గా ఈ విషయంలో 53.85%తో రాష్ట్రం నాలుగో స్థానంలో ఉండటం ఆమోదయోగ్యం కాదని మంత్రి స్పష్టంచేశారు 57.50% సిజేరియన్లతో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉండగా 55.40% తో జమ్మూ అండ్ కాశ్మీర్ రెండోస్థానంలో, తమిళనాడు 54.92% తో మూడో స్థానంలో ఉన్నాయి



2025-26లో రాష్ట్రంలో మొత్తం 5,20,680 ప్రసవాలు జరగ్గా ఇందులో 2,80,318 సిజేరియన్ కింద నమోదయ్యాయి. ప్రభుత్వాసుపత్రుల్లో 40.31% సిజేరియన్లు జరుగుతుండగా ప్రైవేటు ఆసుపత్రుల్లో భారీ స్థాయిలో 63.84% జననాలు సిజేరియన్ల ద్వారా జరుగుతున్నాయి.

**లక్ష్య నిర్ధారణ** : తల్లీబిడ్డలకు ప్రయోజనకరమైన సహజ ప్రసవాలను పెంపొందించే దిశగా 2028-29 నాటికి ప్రభుత్వాసుపత్రుల్లో సిజేరియన్లను ప్రస్తుతం ఉన్న 43% ను 24%కు తగ్గించాలని, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరుగుతోన్న సిజేరియన్లను 64% నుంచి 47%కు తగ్గించాలని, ఇందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రుల్లో జరుగుతోన్న సిజేరియనపై పటిష్టమైన ఆడిటింగ్ జరగాలని, ఆకారణంగా జరిగే వాటికి అడ్డుకట్ట వేయాలని మంత్రి స్పష్టంచేశారు ఈ దిశగా 20 ప్రభుత్వాసుపత్రుల్లో పైలటు ప్రాతిపదికన నెలరోజులపాటు జరిగే సిజేరియన్లపై సమగ్రమైన ఆడిటింగ్ చేసి, ప్రసవాల సరళి, కారణాలపై నివేదిక అందచేయాలని మంత్రి ఆదేశించారు ఇదే విషయంలో ప్రైవేటు ఆసుపత్రులపై డీఎం అండ్ హెచ్వోల పర్యవేక్షణను పటిష్టంచేసి, ఆడిటింగ్, ఇతర చర్యల ద్వారా సిజేరియన్లను అడ్డుకోవాలని స్పష్టంచేశారు. ప్రస్తుతం సిజేరియన్, సహజ ప్రసవాలకు ప్రభుత్వం నుంచి ఆసుపత్రులకు జరుగుతోన్న చెల్లింపులను పరిశీలించి, సిజేరియన్లను అదుపు చేయడానికి, సహజ ప్రసవాలను పెంచేందుకు వీలుగా ప్రస్తుత చెల్లింపులను హేతుబద్ధంచేస్తూ సహజ ప్రసవాల ద్వారా పిల్లలకు జన్మనిస్తోన్న తల్లులకు ప్రత్యేక ప్రోత్సాహకం అందించే దిశగా ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు.

**వైద్య నిర్ధారణ పరీక్షలకు టోకెన్లు** : ప్రభుత్వాసుపత్రుల్లో నిరంతరం పెరుగుతోన్న ఓపీ, ఐపీ సేవల కారణంగా వైద్య నిర్ధారణ (డయాగ్నస్టిక్ టెస్టు) పరీక్షలకు డిమాండ్ పెరిగి రోగులు గంటలకొద్దీ వేచి ఉండటంపై మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరీక్షల నిర్వహణ విదానాన్ని సమగ్రంగా మార్చి, నిర్ణీత సమయంలో వైద్యులు సూచించిన ఎక్సరే, సీటీ స్కాన్, ఎమ్మారై, పెటు స్కాన్ సేవలు అందుతాయన్న భరోసా రోగుల్లో కల్పించాలని తెలిపారు. ఈ మేరకు వారంరోజుల్లో ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఈ నూతన పరీక్షల నిర్వహణ విధానాన్ని విశాఖలోని కేజీహెచ్, విజయవాడ జీజీహెచ్ తోపాటు ఎంపికచేసిన సెకండరీ ఆసుపత్రుల్లో పైలటుగా అమలుచేసి, అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపచేయాలని మంత్రి సూచించారు. ఈ దిశగా ప్రతి రోగికి టోకెన్లు ఇచ్చి, ముందుగా వచ్చిన వారికి ముందుగా నిర్దిష్ట సమయంలో పరీక్షలు చేసేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

**డయాగ్నస్టిక్ పరికరాల వినియోగంలో భారీ వ్యత్యాసమెందుకు?** : ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య నిర్ధారణ పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన యంత్రాలు, పీపీపీ ద్వారా సేవలు అందిస్తున్న యంత్రాల వినియోగంలో భారీ వ్యత్యాసంపట్ల మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఒక సీటీ స్కాన్ యంత్రం రోజుకి 15 మంది రోగులకు పరీక్షలు చేయాలని ప్రామాణీకరించగా ప్రభుత్వం నిర్వహించే మెషిన్ ద్వారా సగటున 34 పరీక్షలు చేస్తుండగా పీపీపీ కింద నడిచే ప్రతి మెషిన్ ద్వారా 78 స్కాన్లు చేస్తున్నట్లు మంత్రి గమనించారు ఎమ్మారై స్కాన్లకు సంబంధించి ఈ వివరాలు 7, 8, 25గా వెల్లడయ్యాయి. యాంజియోగ్రామ్ విషయంలో ఈ విలువలు 15, 10, 19 చొప్పున ఉన్నాయి. ఈ విషయంపై జరిగిన చర్చ సందర్భంగా ప్రభుత్వాసుపత్రుల్లో సిబ్బంది కొరత కొంతమేరకు కారణం కావొచ్చునని అధికారులు తెలిపారు. ఈ వ్యత్యాసాన్ని సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వం నిర్వహించే యంత్రాల వినియోగాన్ని పెంచేదిశగా తగు ప్రణాళికలు సూచించాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు, డైరెక్టర్ అఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విష్ణువర్ధన్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# దేశ అభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర

(మొదటి పేజీ తరువాయి)

ఆలస్యమయ్యే రైళ్లు, పాతబడిన మౌలిక సదుపాయాలకు మారుపేరుగా ఉండేవి. నేడు, ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నేడు... వందే భారత్, బుల్లెట్ రైళ్లు, 'కవచ్' భద్రతా సాంకేతికత, 100% విద్యుదీకరణ, ఆధునిక సరుకు రవాణా కారిడార్లు, ఆధునీకరించిన రైల్వే స్టేషన్లు, హైడ్రోజన్ ఆధారిత రైళ్ల గురించి ప్రపంచం మాట్లాడుకుంటోంది. ఇది సాధారణ ఆధునీకరణ మాత్రమే కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతీయ రైల్వేలో జరుగుతున్న అతిపెద్ద మార్పు ఇది. ఇది ఒక రైల్వే విప్లవం. దేశం అభివృద్ధి చెందాలంటే రైల్వేలు అభివృద్ధి చెందాలనేది ప్రధాని మోదీ గారి ఆలోచన. నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో, రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ గారి దార్శనికతతో, భారతీయ రైల్వే చరిత్రలోనే అతిపెద్ద ఆధునీకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోంది. వేలాది కిలోమీటర్ల నూతన రైల్వే లైన్లను నిర్మిస్తున్నారు. ముంబై--అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ భారతదేశానికి హై-స్పీడ్ రైలును తీసుకువస్తూ, ప్రపంచ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలను నిర్మించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని నిరూపిస్తోంది. పర్యావరణహిత రవాణా రంగంలో ప్రపంచానికి నాయకత్వం వహించడానికి భారతదేశం సిద్ధంగా ఉందని హైడ్రోజన్ రైలు నిరూపిస్తోంది. మన మంగళగిరి రైల్వేస్టేషన్ లో ఎక్కువ రైళ్లు ఆగేలా చూడాలని ఈ సందర్భంగా పెద్దలను కోరుతున్నా.

**దక్షిణ భారతదేశంలో నెం.1 రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతాం** : రైల్వే స్టేషన్ల ద్వారా ఆర్థికాభివృద్ధి జరగాలి. ఈ రోజు పెద్దఎత్తున మనం ప్రజారాజధాని అమరావతిని అభివృద్ధి చేసుకుంటున్నాం. అమరావతిలో కేవలం భవనాలు నిర్మించడమే కాదు.. ఎయిర్, రోడ్డు కనెక్టివిటీ, రైలు కనెక్టివిటీ అనేది చాలా ముఖ్యం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఈ మూడింటినీ అనుసంధానం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఒక ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ నెట్ వర్క్ ఏర్పాటుచేసే దిశగా ముందుకు వెళ్తున్నారు. 2019 నుంచి 2024 వరకు అభివృద్ధి నిలిచిపోయింది. అమరావతి పనులు నిలిపివేశారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు కలిసి పెద్దఎత్తున అమరావతి పనులు పరిగెత్తిస్తున్నారు. అమరావతిని గ్లోబల్ సిటీగా తయారుచేయాలనేది మనందరి లక్ష్యం. 60 ఏళ్లు చెమటోడ్చి హైదరాబాద్ ను కలిసికట్టుగా అభివృద్ధి చేసుకున్నాం. అలాంటిది 2014లో కట్టుబట్టలతో మెడపట్టి బయటకు గెంటేశారు. ఈ రోజు



హైదరాబాద్ ను చూసి అసూయ పడుతున్నా. ఆ అసూయ నాలో కసి పెంచింది. ఏపీని కూడా దక్షిణ భారతదేశంలో నెం. 1 రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం.

**కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం** : డబుల్ ఇంజన్ సర్కార్ అనేది చాలా అవసరం. కేంద్రంలో నరేంద్ర మోదీ గారు, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు గారు.. ఇద్దరూ కలిసికట్టుగా ఆంధ్ర రాష్ట్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. విశాఖపట్నం కేంద్రంగా 'సౌత్ కోస్ట్ రైల్వే జోన్'ను ఏర్పాటు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల ఆకాంక్షను మోదీ గారు నెరవేర్చారు. కేంద్ర సహకారంతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. పోలవరం ప్రాజెక్టుకు నిధులు తీసుకువచ్చాం. ఈ రోజు ఏకంగా మంగళగిరిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నాం. మంగళగిరిలో రెండేళ్లలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. శ్మశానాల దగ్గర నుంచి కమ్యూనిటీ భవనాలు, వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధి, రైల్వే స్టేషన్ ఆధునీకరణ వంటి ఎన్నో పనులను ప్రజాప్రభుత్వం చేపట్టింది.

**నా గౌరవాన్ని నిలబెట్టారు**: 2019లో మీ సమస్యలు నేను తెలుసుకోలేకపోయా, నేనేంటో మీకు అర్థంకాలేదు. ఫలితంగా 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఐదేళ్లు కష్టపడ్డా. మీ మనస్సులు గెలుచుకున్నా. ఎవరూ ఊహించని విధంగా మంగళగిరిలో 91వేల మెజార్టీతో విజయం సాధించా. మీరే నా కొండంత బలం. ఈ రోజు నేను ఏ మంత్రి గారితో మాట్లాడినా మంగళగిరి అభివృద్ధికి సహకరిస్తున్నారు. నా గౌరవాన్ని మీరు నిలబెట్టారు. నాపై బాధ్యత పెరిగింది. గడిచిన రెండేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశాం. ఇది తొలి అడుగు మాత్రమే. భవిష్యత్ లో అనేక కార్యక్రమాలు చేపడతాం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబుగారు ఏపీని అభివృద్ధి పథంలో పరిగెత్తిస్తున్నారు. ఈ రోజు అనేక పరిశ్రమలు ఏపీకి తరలివస్తున్నాయి. రాయల్ ఎన్ ఫీల్డ్, గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, ఏఎంసీఏ ప్రాజెక్ట్ ఏపీని వెతుక్కుంటూ వచ్చాయి. ఇంకో మూడేళ్లలో నిరుద్యోగ యువత పక్క రాష్ట్రాలవైపు చూడాల్సిన పనిలేదు. పొరుగు రాష్ట్రాల నిరుద్యోగ యువత ఏపీ వైపు చూసే విధంగా పెట్టుబడులు, పరిశ్రమలను తీసుకువస్తున్నాం.

**మంగళగిరికి పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పిస్తాం** : మంగళగిరి అభివృద్ధికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఎంతో సహకరిస్తున్నారు. ఒక ఎంపీ, ఎమ్మెల్యే కలిసి పనిచేస్తే ఎన్ని అద్భుతాలు చేయవచ్చో మంగళగిరి నిదర్శనం. మంగళగిరికి అనేక పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకువచ్చి యువతకు మన ప్రాంతంలోనే ఉద్యోగాలు కల్పించే దిశగా పనిచేస్తామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్, గతిశక్తి చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ కే. సైమన్, సీనియర్ డీసీఎం డా.సీహెచ్ ప్రదీప్ కుమార్, సీనియర్ డీపీవో కేప్రియల్ అరోర, సీఎంఎస్ కే.శ్రీనివాసులు, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయ్, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్, రూరల్ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేశంనేని శ్రీఅనిత పాల్గొన్నారు.

## క్రీడలను ఎంచుకోండి..
# డ్రగ్స్‌కు దూరంగా ఉండండి



- ఈగల్ విభాగం ఐజీపీ ఆకే రవికృష్ణ
- టీజేపీఎస్ కళాశాలలో ఘనంగా టైక్వాండో పతకాల ప్రదానోత్సవం
- 49 మంది విద్యార్థులకు సత్కారం


**గుంటూరు (జర్నలస్ట్ ఫైల్)** :క్రీడలను జీవితంలో భాగం చేసుకుని మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈగల్ విభాగం ఐజీపీ ఆకే రవికృష్ణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. గుంటూరులోని టీజేపీఎస్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన టైక్వాండో మెడల్ ప్రెజెంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని టైక్వాండోలో ప్రతిభ కనబరిచిన 49 మంది విద్యార్థులకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.వి. కామేశ్వర శాస్త్రి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం, టైక్వాండో కోచ్ చైతన్య, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ఈగల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకే రవికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకుని డ్రగ్స్, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం చేపడుతున్న "పల్లెబాటలో ఈగల్", "ఆపరేషన్ చైతన్యం" కార్యక్రమాలతో పాటు విద్యాసంస్థల్లో ఏర్పాటు చేస్తున్న ఈగల్ క్లబ్‌ల ద్వారా డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. టైక్వాండో, క్రికెట్, ఫుట్‌బాల్ వంటి క్రీడల్లో పాల్గొనడం ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని, ముఖ్యంగా బాలికలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా ఆత్మరక్షణతో పాటు ధైర్యాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో 500 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తుల విక్రయాలను నిషేధించినట్లు వెల్లడిస్తూ, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1972కు తెలియజేయాలని కోరారు.

సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మొబైల్ ఫోన్ వ్యసనంపై కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఐజీపీ సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో ప్రతిరోజూ సమయం గడుపుతూ వారి అలవాట్లను గమనించాలని కోరారు. అనంతరం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం రూపొందించిన ప్రకృతి పరిరక్షణ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కళాశాల సెక్రటరీ కె.వి. బ్రహ్మం మాట్లాడుతూ క్రీడలు బాధ్యతాయుతమైన పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. టైక్వాండో కోచ్ చైతన్య మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, గుంటూరు ఈగల్ సీఐ కె. విక్టర్ బాబు, ఎస్సై ఎం. సునీల్ బాబు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దళిత యువకుల మృతులపై ఐపీఎస్ అధికారితో విచారణ!

- బాధితులకు పూర్తి న్యాయం చేస్తాం: ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్ హామీ
- ముడుమాల, గుండాపురంలో బాధిత కుటుంబాలను పరామర్శించిన కమిషన్ బృందం
- బ్రహ్మంగారిమఠం ఎస్సీ హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ.. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఛైర్మన్

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ) వైయస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలంలో సంచలనం సృష్టించిన దళిత యువకులు సతీష్ ఓబులేష్‌ల అనుమానాస్పద మరణాల కేసుపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ సీరియస్ అయింది. ఈ ఘటనపై సమగ్ర నిజాలను నిగ్గుతేల్చేందుకు ఒక



ఐపీఎస్ అధికారితో అత్యంత వేగంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు కమిషన్ ఛైర్మన్ జవహర్ వెల్లడించారు.

గత ఫిబ్రవరి 5న చోటుచేసుకున్న ఈ విషాద ఘటనపై శుక్రవారం ఆయన కమిషన్ సభ్యులు దాసు, శ్రీపతి బాబు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్‌తో కలిసి ముడుమాల, గుండాపురం గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. మృతి చెందిన యువకుల చిత్రపటాలకు నివాళులర్పించిన అనంతరం, కన్నీరుమున్నీరవుతున్న బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఘటన జరిగిన తీరును, వారికున్న అనుమానాలను అడిగి తెలుసుకున్నారు.

తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టం

కాలజ్ఞానాన్ని బోధించిన వీరబ్రహ్మేంద్రస్వామి నడియాడిన పవిత్ర భూమిపై ఇలాంటి ఘోరం జరగడం అత్యంత విచారకరం. కొన్ని అనివార్య కారణాల వల్లే ఇక్కడికి రావడం కాస్త ఆలస్యమైంది. కానీ, బాధితులకు న్యాయం జరిగే వరకు కమిషన్ అండగా ఉంటుంది. విచారణలో దోషులుగా తేలితే ఎంతటి వారినైనా చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తాం. జవహర్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్

స్వామివారి దర్శనం హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం

గ్రామాల్లో పర్యటన ముగించుకున్న అనంతరం ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్సీ ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహాన్ని (హాస్టల్) ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న వసతులు, మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అక్కడే భోజనం చేసి, వంటకాల నాణ్యతను స్వయంగా పరీక్షించారు. వసతి గృహంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని, మెనూను పక్కాగా అమలు చేయాలని వార్డెన్‌ను, అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు అనిత దీప్తి, దాసు, శ్రీపతి బాబులతో పాటు ఆర్‌డీఓ చంద్రమోహన్, డీఎస్పీ రాజేంద్రప్రసాద్,సీఐ శివశంకర్, స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులు, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నేతలు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మేడారం అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- భక్తులకు ఆహ్లాదకర వాతావరణం, మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- ట్రాఫిక్ సమస్యలు లేకుండా రహదారుల విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలి
- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలి
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు, జూలై 17 (జర్నలిస్ట్ ఫైల్) :** మేడారం మహా జాతరకు విచ్చేసే కోట్లాది మంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.
గురువారం తాడ్వాయి మండలం మేడారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ,జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావుతో కలిసి సమ్మక్క--సారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, మేడారంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
తదుపరి మేడారం ఇంగ్లీష్ మీడియం ఆశ్రమ పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, మేడారం హరిత హోటల్‌లో మేడారం అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ మేడారం మహా జాతరకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా మేడారం-తాడ్వాయి, పస్రా-మేడారం, చిన్నబోయినపల్లి-కొండాయి-ఊరట్టం రహదారుల విస్తరణకు యుద్ధ ప్రాతిపదికన అంచనాలు సిద్ధం చేసి, అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్యూ లైన్లను ఆధునికీకరించడంతో పాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.
జంపన్న వాగు పరిసర ప్రాంతాలను సుందరీకరించి, జంపన్న వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. దీని ద్వారా భక్తులకు ఏడాది పొడవునా పుణ్యస్నానాలు ఆచరించేందుకు నీరు అందుబాటులో ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు.
ప్రధాన రహదారుల ఇరువైపులా, డివైడర్ల మధ్య పచ్చదనాన్ని పెంపొందించేలా పెద్దఎత్తున మొక్కలు నాటాలని, నూతనంగా ఏర్పాటు చేయనున్న స్మృతి వనాన్ని సహజసిద్ధమైన పచ్చదనంతో అభివృద్ధి చేయాలని సూచించారు. భక్తుల కోసం కాటేజీలు, విశ్రాంతి కేంద్రాల ఏర్పాటుకు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.
ఆలయ పరిసరాలతో పాటు మొత్తం మేడారం ప్రాంతాన్ని పారిశుధ్య కార్మికుల ద్వారా నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, దుకాణదారులు తమ పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. రహదారులపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రవాణా, వైద్య సేవలు, భద్రత తదితర అన్ని మౌలిక సదుపాయాలను ముందస్తుగా సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ప్రకృతిని మనం రక్షిస్తే ప్రకృతి మనలను రక్షిస్తుందనే భావనతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు.
పచ్చదనం పెంపొందించడం ద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, విద్యాసంస్థ, గ్రామం, ఇంటి పరిసరాల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే ఉద్యమంగా వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా అవి పెరిగి పెద్ద వృక్షాలుగా మారే వరకు సంరక్షించడం ప్రతి పౌరుడు నైతిక బాధ్యతగా వ్యవహరించాలన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ మేడారం అభివృద్ధి పనులన్నింటినీ నిర్దేశించిన గడువులో నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సమ్మక్క--సారలమ్మ వనదేవతల దర్శనం, జిల్లా అభివృద్ధి పైలాన్ ప్రారంభోత్సవం, నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు, సిహెచ్ మహేందర్ జి,సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి,ఆర్ డి ఓ కృష్ణవేణి, జిల్లా అధికారులు,ఆలయ పూజారులు,గుత్తేదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పూజారులు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల కార్యాచరణ ప్రణాళికను వెంటనే అమలు చేయాలి

- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి...
- రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించాలి...
- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ కుష్బూ గుప్తా...




**దేవరకద్ర జూలై 17 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ వానాకాలానికి సంబంధించి అత్యవసర ప్రత్యామ్నాయ పంటల (కంటింజెన్సీ క్రాప్ ప్లాన్) కార్యాచరణ ప్రణాళికను వెంటనే అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.
గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ వర్షాకాలంలో ఎల్ నినో ప్రభావంవల్ల జిల్లాలో ఆశించినంత వర్షాలు లేనందున రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై సూచనలు అందించాలని తెలిపారు. వర్షాలు ఆలస్యమవుతున్న పరిస్థితుల్లో వరి సాగుపై మాత్రమే ఆధారపడకుండా తక్కువ నీటితో సాగు చేయగల పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజల వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. పంటల మార్పిడి ద్వారా రైతులకు ఆర్థిక ప్రయోజనం కలగడంతో పాటు భూసార పరిరక్షణ, భూగర్భ జలాల సంరక్షణకు కూడా తోడ్పాటు లభిస్తుందని అన్నారు. కోయిల్‌సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలను సమీక్షించిన కలెక్టర్, అందుబాటులో ఉన్న సాగునీటిని దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కాలువల ద్వారా నీటి సరఫరా తగ్గితే వాటిపై ఆధారపడిన బోర్‌వెల్లు కూడా ప్రభావితమవుతాయని, విచక్షణారహితంగా బోర్‌వెల్లు తవ్వడం శాశ్వత పరిష్కారం కాదని పేర్కొన్నారు. నీటి వినియోగంలో స్థిరమైన, బాధ్యతాయుతమైన విధానాలు పాటించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు ప్రతి మండలంలో గ్రామసభలు నిర్వహించి రైతులతో నేరుగా చర్చించాలని, ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి విజయవంతమైన రైతులను గుర్తించి వారి అనుభవాలను ఇతర రైతులతో పంచుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు తోటి రైతుల అనుభవాలను ఎక్కువగా విశ్వసిస్తారని, అందువల్ల విజయవంతమైన రైతులను ఆదర్శంగా నిలపాలని సూచించారు. రాబోయే రోజుల్లో తాను కూడా ఎంపిక చేసిన మండలాలను సందర్శించి రైతులతో సమావేశమవుతానని తెలిపారు. అంతకుముందు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యలను కలెక్టర్కు వివరించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది ఋతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించాయని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అత్యవసర ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను మూడు దశల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, చెరువులు, కాలువల ద్వారా సాగునీటి అందుబాటును నిరంతరం సమీక్షిస్తూ రైతులకు అనువైన పంటలపై మార్గదర్శకాలు అందజేస్తామని చెప్పారు. తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే, తక్కువ నీటితో సాగు చేయగల కరువును తట్టుకునే పంటలను సాగు చేయాలని రైతులకు సూచిస్తున్నామని తెలిపారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని సాగు విస్తీర్ణాన్ని నిర్ణయించుకోవాలని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా జొన్న, సజ్జ, రాగి, ఆముదం, కంది మొక్కజొన్న నల్ల మినుములు, నువ్వులు, ఉలవలు, అలసంద వంటి పంటలతో పాటు తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే కూరగాయల సాగుపై కూడా అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. సమావేశంలో సాగునీటి, ఉద్యానవన, విద్యుత్, పశుసంవర్ధక శాఖల అధికారులు తమ శాఖల పరిస్థితులను కలెక్టర్ కు వివరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా.ఆదేశించారు. అనంతరం వ్యవసాయ శాఖ ద్వారా రూపొందించిన రైతు సూచనల కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మంత్రుల పర్యటనలతో గద్వాలకు ఒరిగిందేమీ లేదు

**– బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు విమర్శ**



**గద్వాల, జూలై 17 (జర్నలిస్ట్ ఫైల్) :** గద్వాల నియోజకవర్గానికి మంత్రులు తరచూ వస్తున్నప్పటికీ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మాత్రం విడుదల కావడం లేదని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్ తో పాటు పార్టీ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గద్వాల నియోజకవర్గం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. మంత్రుల పర్యటనలు కేవలం రాజకీయ హడావుడి, వర్గపోరాటాలకే పరిమితమవుతున్నాయని, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు లేదా కొత్త నిధుల ప్రకటనలు కనిపించడం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి ఇటీవల ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి వచ్చినప్పటికీ, నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులు, ప్రజల సమస్యలు, అభివృద్ధి నిధులపై ఒక్క మాట కూడా మాట్లాడకుండా వెళ్లిపోవడం బాధాకరమని అన్నారు. గద్వాల ప్రజల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా అని ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రారంభమైన అభివృద్ధి పనులే ఇప్పటికీ కొనసాగుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా పెద్ద ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. రైతులకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు కూడా నెలల తరబడి మంజూరు కాకపోవడంతో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సమీపంలో ఉన్న ర్యాలంపాడు రిజర్వాయర్‌లో ఉన్న లీకేజీ సమస్యను పరిశీలించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. అలాగే ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సభలో మహిళలు వ్యక్తం చేసిన అసంతృప్తి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతకు సంకేతమని వ్యాఖ్యానించారు. ఈ మీడియా సమావేశంలో జి.రాఘవేంద్ర రెడ్డి, కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్, చంటన్న, గువ్వల గోపాల్, మోహన్ యాదవ్, చిత్తరి కిరణ్, కమ్మరి రాము, చక్రీధర్ రెడ్డి, బీచుపల్లి వెంకటేష్ యాదవ్, తిమ్మప్ప గౌడ్, శ్రీరాములు, పూడూరు రఘు నాయుడు, గంజిపేట అరవింద్, మాలిక్, రాము, లోకేష్, భాస్కర్, జగదీష్, నరసింహులు, గోవిందు, వీరేష్, రాజు, మహేష్, కృష్ణ, మహేందర్, నరేష్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక నిరాధారమై ఆరోపణలు చేస్తున్న పాలమూరు బీఆర్ఎస్ నాయకులు..

- బీఆర్ఎస్ పార్టీ మాజీ నాయకులు అనేకంటే అబద్దాలకోరులు అనడం కరెక్ట్....
- నీళ్ల నిరంజన్ రెడ్డి కాదు భూ ఖబ్జాల రెడ్డి...
- జీఎమ్ఆర్ దేవరకద్ర శాసన సభ్యులు



**దేవరకద్ర జూలై 17 (జర్నలిస్ట్ ఫైల్) :** నిన్న దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండలంలో 1.70 కోట్ల నిధులతో నిర్మించిన బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవం కార్యక్రమానికి మన గౌరవ ముఖ్య మంత్రి వచ్చారు అని కడుపు మంటతో కుళ్ళు కుతంత్రాలతో ఎవరు రాని వాళ్ల భవన్ లో ప్రెస్ మీట్ పెట్టుకొని ప్రజా ప్రభుత్వంపై అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. బిఆర్ఎస్ నాయకులకు మొదటి నుంచి అలవాటు డైవర్షన్ పాలిటిక్స్ చేయడం. అందుకే ఈ బాలికల ఉన్నత పాఠశాలను మన గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారిచే బ్రహ్మాండంగా పాఠశాలను ప్రారంభోత్సవం చేసుకున్నాం.ఈ కార్యక్రమాన్ని చూసిన టిఆర్ఎస్ నాయకులకు కడుపు మండి తగుదునమ్మా అంటూ ఈరోజు ఉదయం సంబంధంలేని అనవసరమైన విషయాలను ప్రస్తావిస్తూ పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.వనపర్తి మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నీళ్ల నిరంజన్ రెడ్డి అని చెప్పుకునే ఈ భూకబ్జాలు నిరంజన్ రెడ్డి....టిఆర్ఎస్ కంటే ముందు అసలు ప్రభుత్వమే లేదన్నట్టు టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అనే జనం మంచినీళ్లు తాగారన్నట్లు టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే రైతులు వ్యవసాయం చేశారు అన్న రీతిలో మాట్లాడుతున్నారు. భూకబ్జాల నిరంజన్ రెడ్డి సమైక్య రాష్ట్రంలో మీ పార్టీ మీ బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం కంటే ముందే రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి ప్రాజెక్టులు,ఎన్నో రిజర్వాయర్లు,బ్యారేజీలు డ్యాములు నిర్మించారు. భూ ఖబ్జాల నిరంజన్ రెడ్డి నీవు మంత్రిగా,ఆలా వెంకటేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే 10 ఏళ్ళు చేయలేని పనులు....కేవలం రెండున్నర సంవత్సర కాలంలో కనివిని ఎరుగని రీతిలో చేసి చూపించాను.దేవరకద్ర నియోజకవర్గం వ్యాప్తంగా అభివృద్ధి సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రజా పాలన కొనసాగిస్తున్నాం.
ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, విద్య,వైద్యం, ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం అని పేర్కొన్నారు.భూ ఖబ్జాల నిరంజన్ రెడ్డి మీరు కళ్లు ఉండి చూడలేని కబోదులు...మీరు ప్రెస్ మీట్ లు కాదు పొర్లు దండాలు పెట్టిన BRS మల్లి అధికారంలోకి వచ్చేది లేదు...మీరు ఎప్పటికి మాజీలే అంటూ విమర్శించారు.

# చిల్డ్రన్ అండ్ ఉమెన్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

-"బాలికలను రక్షిద్దాం- బాలికలను చదివిద్దాం" పై అవగాహన సదస్సు.
- బాల్య వివాహాలు, లింగ వివక్షత రూపుమాపాలి.
- జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూపారాణి.



**పర్వతగిరి జూలై 17 (జర్నలిస్ట్ ఫైల్) :** చిల్డ్రన్ అండ్ ఉమెన్ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి అన్నారు. గురువారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూపారాణి తో కలిసి "బాలికలను రక్షిద్దాం- బాలికలను చదివిద్దాం" పై కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ నజియా సల్మా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్విహించారు. ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి మాట్లాడుతూ బాల్య వివాహ నిరోధక చట్టం 2006, పోక్సో చట్టం 2012, చిల్డ్రన్ అండ్ వుమెన్ లైంగింక వేధింపుల నిరోధక చట్టం 2013, సైబర్ క్రైమ్ 1930, ఉమెన్ హెల్ప్ లైన్ 181, చిల్డ్రన్ హెల్ప్ లైన్ 1098 సేవలపై విద్యార్థినిలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప రాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు, లింగ వివక్షత రూపుమాపి, ప్రతి బాలికకు విద్య, రక్షణ పై సమాన అవకాశాలు కల్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నజీయాసల్మా, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు సాగునీరు అందించడమే ఎమ్మెల్యే దొంతి లక్ష్యం



**నల్లబెల్లి జూలై 17 (జర్నలిస్ట్ ఫైల్) :** రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కాలువ పనులను ప్రారంభించారని పిఎసిఎస్ చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతిరావు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో రంగయ్య చెరువు కుడికాలువ పనులపై వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాలోతు రమేష్ తో కలిసి రఘుపతిరావు సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లబెల్లి, దుగ్గొండి మండలాల రైతులకు సాగునీరు అందించాలని లక్ష్యంతో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఓపెన్ కెనాల్ ద్వారా సాగునీరు అందిస్తుంటే అది ఓర్చుకోలేని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. పంట కాలువ ద్వారా సాగునీరు అందించాలనే లక్ష్యంతో NHAI నుండి అనుమతులు వచ్చిన వెంటనే రోడ్డు కటింగ్ చేసి రైతులకు కాలువల ద్వారా సాగునీరు అందించాలనే సదుద్దేశంతో అనుమతులు రాగానే కాల్వ పనులను అధికారులు ప్రారంభించినారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నా హెచ్చరికతోనే పనులు ప్రారంభించారని చిల్లర మాటలు మాట్లాడటం అనుకోవాలని హెచ్చరిస్తున్నామన్నారు.మాజీ ఎమ్మెల్యే రాజకీయ పబ్బం గడుపుకొని తన స్వలాభం కోసం పనిచేసిండు తప్ప ఒక్కనాడు సైతం రైతులకు సాగునీరు అందించాలని ఆలోచన చేయలేదని, రైతులకు సాగునీరు అందించాలని పంట కాలువ పనులను ప్రారంభిస్తే రైతులలో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి మంచి పేరు వస్తుందని ఉద్దేశంతో పెద్ది సుదర్శన్ రెడ్డి చిల్లర మాటలు మాట్లాడటం సరేంది కాదన్నారు. ఇప్పటికైనా సొంత డబ్బా కొట్టుకోవడం మనుకొని అభివృద్ధి పనులకు సహకరించాలని, లేనియెడల నిన్ను నర్సంపేట ప్రాంత రైతులు గ్రామాలలో అడుగుపెట్ట నివ్వరని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు జిల్లా మునీందర్, నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, పిఎసిఎస్ డైరెక్టర్ వైనాల అశోక్, పిఎసిఎస్ డైరెక్టర్లు మామిండ్ల రాజిరెడ్డి, బత్తిని మల్లయ్య పాల్గొన్నారు.

# గోపనపల్లిలో 100 శాతం పూర్తయిన డిజిటలైజేషన్ ప్రక్రియ

**- సన్మానం పొందిన బిఎల్వోలు.**



**పర్వతగిరి, జూలై 17 (జర్నలిస్ట్ ఫైల్) :** పర్వతగిరి మండలం గోపనపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ నాంపల్లి విజయ- అశోక్, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు మిట్టపల్లి నాగార్జున ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ సర్వేలో భాగంగా అందించిన ఎన్యూమరేషన్ ఫారాలు ప్రభుత్వం ప్రకటించిన గడువులోపే డిజిటలైజేషన్ ప్రక్రియ మండలంలో ప్రథమ స్థానంలో 100 శాతం పూర్తిచేసిన సందర్భంగా గ్రామ బి.ఎల్.ఓ లైన బోనాల. ఉపేంద్ర జన్ను. సరిత లను శాలువలతో సన్మానం చేసి అభినందించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాంపల్లి విజయ -అశోక్, శ్రీ మల్లిఖార్జున స్వామి దేవస్థాన చైర్మన్ కారింగుల రాము, నాయకులు ఆకుల సతీష్, నాంపల్లి బిక్షపతి, బెల్లం కుమారస్వామి, రొడ్డ వేణు, జన్ను నర్సయ్య, నాంపల్లి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ డా. సత్యశారద



**నర్సంపేట, జూలై 17 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా నర్సంపేట పాకాల రోడ్డులోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల (మోడల్), ఇంగ్లీష్ మీడియంను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద గురువారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణను పరిశీలించారు.
ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యం, పాఠ్యాంశాలపై అవగాహనను ప్రశ్నల ద్వారా పరీక్షించారు.విద్యార్థులు చురుకుగా చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.అనంతరం నాణ్యత పెంపు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల కోసం సమర్థవంతమైన బోధనా విధానాలను అమలు చేయాలని సూచించారు ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.పాఠశాలలో పరిశుభ్రత, మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, బోధన--అభ్యాస వాతావరణాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రధానోపాధ్యాయునిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాఠశాలలో పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, జీవన నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులను సమగ్ర వ్యక్తిత్వంతో తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.ఈ సందర్శనలో ఆర్డిఓ నర్సంపేట ఉమారాణి, నర్సంపేట తహసిల్దార్ రవిచంద్ర రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తాని కలిసిన ఎమ్మెల్యే జీఎమ్ఆర్



**దేవరకద్ర జూలై 17 (జర్నలిస్ట్ ఫైల్) :** మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ గారిని కలిసి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మరియు మిషన్ భగీరథ, బ్రహ్మోస్ ప్రాజెక్ట్ సంబంధించిన అంశాలపై చర్చించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి...

# కూకట్పల్లి నియోజకవర్గంలో ఎస్ఐఆర్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన

**కూకట్‌పల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** కూకట్పల్లి నియోజకవర్గంలోని కూకట్పల్లి బూత్ పరిధిలోని రామాలయం వద్ద ఈరోజు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ( ఎస్ ఐ ఆర్ )కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని చేదురుపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీ య జనతా పార్టీ సీనియర్ నాయకులు అర్చనపల్లి సూర్యారావు గారు పాల్గొని ఓటర్లతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేస్తూ, ఓటరు జాబితాలో వివరాల సవరణ, కొత్త ఓటరు నమోదు, అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ హెల్ప్‌డెస్క్‌కు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను తెలియజేయడంతో పాటు, ఓటరు నమోదు ప్రక్రియపై పూర్తి సమాచారం పొందారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అమూల్యమైనదని, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు సక్రమంగా నమోదు చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ద్వారా ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో మరింత చైతన్యం, అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగరాజు అనంత దుర్గారావు, కట్ట శంకర్ రెడ్డి, గడ్డం వెంకటరమణారెడ్డి, కృష్ణప్రియ చక్రవర్తి, మందుమూల సంతోష్, జక్కల వినయ్ కుమార్, కొమ్ము ప్రభాకర్, శ్రీనాథ్ సాయి, కొడిచెర్ల రాఘవేంద్ర, గౌని మంజునాథ్, రామకృష్ణ చారి, మన్నే భాస్కర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# షీర్ వాల్ టెక్నాలజీతో మోపాల్ పోలీస్ స్టేషన్ పనులు

## - ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి

**నిజామాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని మోపాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను గురువారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి పరిశీలించారు. ఆధునిక "షీర్ వాల్" సాంకేతికత తో సాగుతున్న ఈ నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించి, పనుల పురోగతిపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి మాట్లాడుతూ...షీర్ వాల్ సాంకేతికతతో నిర్మించే భవనాలు అత్యంత బలంగా, మన్నికగా ఉంటాయని తెలిపారు. ఈ సరికొత్త టెక్నాలజీతో కట్టే నిర్మాణాలు భూకంపాలను సైతం సమర్థంగా తట్టుకుంటాయని ఆయన పేర్కొన్నారు. సాధారణ పద్ధతులతో పోలిస్తే ఈ సాంకేతికత ద్వారా నిర్మాణ పనులు చాలా వేగంగా పూర్తవుతాయని వెల్లడించారు.పేద ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన గృహాలను అందించాలనే లక్ష్యంతో... రాబోయే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కూడా ఈ "షీర్ వాల్" టెక్నాలజీని ఉపయోగించే అంశాన్ని పరిశీలిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు మరియు నిర్మాణ విభాగానికి చెందిన సిబ్బంది పాల్గొన్నారు.



**SIR ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి:**
నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి మోపాల్, ముదక్‌పల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. డబుల్, షిఫ్టింగ్, మరణించిన వారి ఓట్ల తొలగింపు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల భాగస్వామ్యంతో 85 శాతం ప్రక్రియ పూర్తికావడాన్ని అభినందించారు. ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని హితవు పలికారు.

# వార్షిక తనిఖీలలో భాగంగా జిన్నారం సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**సంగారెడ్డి (జర్నలిస్ట్ ఫైల్) :** వార్షిక తనిఖీలలో భాగంగా ఈ రోజు (16.07.2026) జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. జిన్నారం సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ లను సందర్శించారు. ఈ సందర్భంగా జిన్నారం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, పటాన్‌చెరువు డీఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, స్టేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సిబ్బందికి అందజేసిన కిట్ ఆర్టికల్స్‌ను జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న స్వాధీనపరచుకున్న, కేసులకు సంబంధించిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకొని, క్రైమ్ సంబంధించిన వాహనాలను సకాలంలో కోర్టులో డిపాజిట్ చేయాలని, అన్‌క్లెయిమ్డ్ వాహనాలను బహిరంగ వేలం ద్వారా డిస్పోజ్ చేయాలని ఆదేశించారు.అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ప్రతి రికార్డును అప్డేట్ గా ఉంచాలన్నారు. విలేజ్ పోలీసు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామ పెద్దలు, యువతతో సమన్వయం కలిగి శాంతిభద్రతలకు సంబంధించిన ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ హిస్టరీ షీటర్ల వివరాలను పరిశీలిస్తూ, వారి కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, పగలు, రాత్రి బీట్‌లలో వారిని తరచూ తనిఖీ చేసి, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో పరిశ్రమలు ఉండటంతో వలస కార్మికులు (మైగ్రెంట్ లేబర్) ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఆస్తి సంబంధిత నేరాలు జరిగే అవకాశాలు కూడా అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. ఆస్తి సంబంధిత నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను క్రైమ్ ప్రోన్ ఏరియాలుగా గుర్తించి, బ్లాక్ స్పాట్లుగా అభివృద్ధి చేసి, పగలు–రాత్రి బీట్ విధుల్లో నిఘా మరింత పెంచాలని ఎస్‌హెచ్‌ఓకు సూచించారు. నేరాల నియంత్రణ, నేరాల ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించి, స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అనంతరం సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తూ, గ్రేవ్ కేసులలో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ, ఎలాంటి రికార్డులు పెండింగ్‌లో లేకుండా చూసి, అవసరమైన సూచనలు ఎస్‌హెచ్‌ఓలకు అందించాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ, యువ కానిస్టేబుళ్లు అన్ని రకాల విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని, భవిష్యత్తులో స్టేషన్ రైటర్లుగా ఎదగాలని సూచించారు. తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే పోలీస్ శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. సీసీటీఎన్ఎస్–2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్–కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ–సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, సీడీఆర్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి పట్టు సాధించి, నేరాల నియంత్రణలో సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. స్టేషన్ రికార్డులైన పార్ట్–1 నుండి పార్ట్–5 వరకు ఎలాంటి పెండింగ్ లేకుండా సీసీటీఎన్ఎస్–2.0లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే సిబ్బందికి వర్టికల్ వారీగా విధులు కేటాయించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు సూచించారు. జిన్నారం సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల మెయింటెనెన్స్ సంతృప్తికరంగా ఉన్నప్పటికీ, విధుల నిర్వహణలో మరింత కష్టపడి పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఎస్పీ సూచించారు.ఈ తనిఖీల సందర్భంగా జిల్లా ఎస్పీ వెంట పటాన్‌చెరువు డీఎస్పీ ప్రభాకర్, జిన్నారం సీఐ పి. రమణారెడ్డి, ఎస్‌హెచ్‌ఓ హనుమంతు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.




# ఇస్కాన్ సదాశివపేట వారి ఆధ్వర్యంలో సోమవారం జరిగే జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయాలన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు



**సంగారెడ్డి (జర్నలిస్ట్ ఫైల్) :** సదాశివపేటలో ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేది సోమవారం రోజున మధ్యాహ్నం 1:00 గంటలకు నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవాన్ని భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు పిలుపునిచ్చారు.శ్రీ జగన్నాథ రథయాత్రకు సంబంధించిన కరపత్రాన్ని ఇస్కాన్ టెంపుల్ భక్త బృందం సభ్యులు పులిమామిడి రాజుకు అందజేసి, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని ఆహ్వానించారు.ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ, శ్రీ జగన్నాథ రథయాత్ర భారతీయ సనాతన ధర్మ వైభవాన్ని చాటిచెప్పే మహోత్సవమని అన్నారు. భక్తి, ఐక్యత, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర రథయాత్రలో ప్రతిu ఒక్కరూ పాల్గొని శ్రీ జగన్నాథ స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందాలని కోరారు.ఈ రథయాత్ర సదాశివపేటలోని దుర్గమ్మ గుడి నుండి ప్రారంభమై శాస్త్రి రోడ్, సుభాష్ రోడ్, గాంధీ చౌక్ మీదుగా ప్రారంభమై సాయంత్రం 6:00 గంటలవరకు శ్రీ స్థానిక బసవ సేవాసదన్ ఫంక్షన్ హాల్ వరకు వైభవంగా కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హెచ్. హెచ్. భక్తి వైభవ స్వామి ప్రభుపాద ప్రచారక్ ప్రభువానంద దాస్ ప్రభుజీ విచ్చేసి భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించనున్నారని పేర్కొన్నారు.సదాశివపేట పట్టణంతో పాటు సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరూ కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో హాజరై ఈ దివ్య రథయాత్రను విజయవంతం చేయడంతో పాటు భగవంతుని కృపకు పాత్రులు కావాలని పులిమామిడి రాజు పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీ రామ్ ప్రభు, మాశెట్టి ప్రవీణ్ కుమార్, వేణు గోపాల్, రామ క్రిష్ణ, అభి రామ్ మరియు పి. ఎం. ఆర్ యవసేన నాయకులు రాగం అనిల్, గుణాకర్, తాలెల్మ రాము, సోమ శంకర్, అఖిల్ మొదలగు వారు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సదాశివపేటలో ప్రకృతి, ఆరోగ్యం, విద్యపై అవగాహన కార్యక్రమం

## – 5 కంప్యూటర్ల బహుకరణ, హరిత హారం కార్యక్రమం





**సంగారెడ్డి (జర్నలిస్ట్ ఫైల్) :** సదాశివపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రకృతి, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై ఇన్చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి శంకర్ సార్ గారి ఆదేశాల మేరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రకృతివనం ప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి అద్భుతమైన ప్రసంగం చేశారు.ఈ సందర్భంగా ఆయన ప్రకృతి ఆహారం, ఆరోగ్యకరమైన జీవన విధానం, పర్యావరణ పరిరక్షణ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం గురించి వివరించారు. విద్యార్థులు ప్రకృతికి దగ్గరగా ఉంటే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.అనంతరం బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు 5 కంప్యూటర్లను, హరితహారం డ్రైవ్ ను నిర్వహించారు. ఈ కంప్యూటర్లు విద్యార్థుల డిజిటల్ విద్యాభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఉదయం పూట సంగారెడ్డి లో గల సర్ సి.వి. రామన్ సైన్స్ మ్యూజియం కూడా సందర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డిసిఇబి కార్యదర్శి లింబాజీ, మండల విద్యాధికారి (యం ఇ ఓ) శంకర్, జిల్లా సైన్స్ అధికారి (డి ఎస్ ఓ) పి .సిద్దారెడ్డి, యన్ జి సి జిల్లా సమన్వయకర్త మాధవ రెడ్డి, ప్రకృతివనం డైరెక్టర్ లవకుశ, బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ప్రతినిధులు రామకృష్ణ, ప్రవీణ్, ప్రకృతి ప్రేమికుడు జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు మరియు ఉపాధ్యాయ బృందాన్ని అతిథులు అభినందించారు.

# హుడా కాలనీలో మసీదు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం వినతి



**రాజేంద్రనగర్ (జర్నలిస్ట్ ఫైల్) :** జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని హుడా కాలనీలో గత 30 సంవత్సరాలుగా హిందూ,ముస్లిం,క్రైస్తవ సోదరులు సామరస్య వాతావరణంలో కలిసి జీవిస్తున్నారని,అదే స్ఫూర్తితో ముస్లిం సోదరుల ప్రార్థనల కోసం మసీదు నిర్మాణానికి తగిన స్థలాన్ని కేటాయించాలని స్థానిక ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం ప్రతినిధులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు.కాలనీలో ఇప్పటివరకు మసీదు లేకపోవడంతో,ముఖ్యంగా వృద్ధులు,చిన్నారులు ప్రతిరోజూ నమాజ్ నిర్వహించేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని,దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు వివరించారు. మసీదు నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి,అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తీగల శివకుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ..హుడా కాలనీలో అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, సోదరభావంతో జీవిస్తున్నారని,"మనమంతా అన్నదమ్ములమే" అనే భావనతో ప్రతి ఒక్కరూ కలిసిమెలసి ఉండాలని అన్నారు. ముస్లిం సోదరుల న్యాయమైన విజ్ఞప్తికి తన పూర్తి మద్దతు ఉంటుందని,వారి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.హుడా కాలనీలో ఇప్పటికే హిందూ సోదరుల కోసం హనుమాన్ ఆలయం,క్రైస్తవ సోదరుల కోసం ప్రార్థనా మందిరం ఉన్న నేపథ్యంలో,ముస్లిం సోదరుల ప్రార్థనల కోసం కూడా మసీదు ఏర్పాటుకు తగిన స్థలాన్ని కేటాయించాలని వినతిలో కోరారు.ఈ కార్యక్రమంలో హుడా కాలనీ ముస్లిం మైనారిటీ సంక్షేమ సంఘం ప్రతినిధులు,ముస్లిం పెద్దలు,యువకులు,స్థానిక ప్రజలు,మైనారిటీ నాయకులు,కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జగన్నాథుని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

### మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుకు లావణ్య దేవేందర్ యాదవ్



**షాద్‌నగర్ (జర్నలిస్ట్ ఫైల్) :** జగన్నాథుని ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా,శాంతి, ఆనందాలతో నిండాలని మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుకు లావణ్య దేవేందర్ యాదవ్ ఆకాంక్షించారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఆర్టీసీ కాలనీలోని శ్రీ జగన్నాథ స్వామి వారిని మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుకు లావణ్య దేవేందర్ యాదవ్,మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ రథయాత్ర ద్వారా ప్రతి ఒక్కరికీ శాంతి, మానసిక బలం, మరియు కొత్త ఆశలు అందించాలనే ఉద్దేశ్యంతో సాగుతుందని వారు పేర్కొన్నారు. జగన్నాథ స్వామి దివ్య ఆశీస్సులు ప్రతి ఒక్కరి హృదయానికి శాంతిని అందించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో షాద్నగర్ కౌన్సిలర్స్ శివ, గోపాల్,సుధీర్,మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్,వెంకట్రామిరెడ్డి,మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్,నాయకులు బిక్షపతి,ఒడిస్సా శంకర్,వేణు, తదితరులు పాల్గొన్నారు

# అందరి లక్ష్యం డంపింగ్ యార్డ్ రద్దు...



**షాద్‌నగర్ (జర్నలిస్ట్ ఫైల్) :** అందరి లక్ష్యం డంపింగ్ యార్డ్ రద్దని దాన్ని సాధించేందుకు పార్టీలకతీతంగా పోరాడుదామని డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ అన్నారు.డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపేందుకు గురువారం ఆమె మండలంలోని సిద్దాపూర్ గ్రామానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ ఆమెకు డంపింగ్ యార్డ్ రద్దుకు మద్దతు తెలిపాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సిద్దాపూర్ చుట్టూ ఉన్న సుమారు 50 గ్రామాలకు డంపింగ్ యార్డ్ ఎఫెక్ట్ ఉంటుందని అన్నారు. ఈ ప్రాంతంలో దాదాపు చిన్న సన్నకారు రైతులే ఉన్నారని పొట్ట కొట్టి వారి జీవితాలను రోడ్డున వేయొద్దని వేడుకున్నారు. మేమంతా ఒక తల్లి పిల్లలమని పార్టీ జెండా, ఎజెండా పక్కనపెట్టి పోరాడుదామని పిలుపునిచ్చారు.రైతు కాండువతో చలో సెక్రటేరియట్ గాని చలో కలెక్టరేట్ అని ఏ ఒక్కరు పిలుపునిచ్చిన లక్ష మందితో విజయవంతం చేయాలని అన్నారు.భార్యా పిల్లలను వదులుకొని పనిచేస్తున్నామని ప్రభుత్వం జీవో నెంబర్ 641 రద్దు చేయకపోతే చివరకు ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధమవుతామని హెచ్చరించారు.డంపింగ్ యార్డ్ రద్దుకు మద్దతు తెలిపిన ఎంపీ డీకే అరుణమ్మకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, కాంగ్రెస్,బిజెపి పార్టీలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# వర్షాలు సమృద్ధిగా కురవాలని గుంజపడుగు గ్రామంలో గాలి దేవుడు, చిన్నయ్య - పెద్దయ్య దేవుళ్లకు మొక్కులు





**మంథని (జర్నలిస్ట్ ఫైల్) :** మంథని మండలం గుంజపడుగు గ్రామంలో ముదిరాజ్ కులస్తులు, గ్రామ ప్రజలు కలిసి గ్రామ దేవతలైన గాలి దేవుడు, చిన్నయ్య–పెద్దయ్య దేవుళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ఈ మొక్కులు పెట్టుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండెవెన సంధ్య బానేష్, మాజీ వైస్ ఎంపీపీ ఊదరి శంకర్, సాదుల తిరుపతి, నీరటి స్వామి, సాదుల ఓదెలు, పెయ్యాల సంతు, మట్ట తిరుపతి, శ్రీను జన్నే, మరాఠీ శ్రీను, అలాగే ముదిరాజ్ పెద్దమనుషులు సాదుల చంద్రయ్య, మబ్బు బాణయ్య, ఊదరి శంకర్, కొంతం రాజు పాల్గొన్నారు.

# సుందరయ్యనగర్ లో సిసి రోడ్డు పనులను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ఇబ్రహీంపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభానికి సీఎం రేవంత్ రెడ్డి వచ్చిన సందర్భంలో ప్రత్యేక నిధుల నుండి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి సహకా రంతో మంజూరైన నిధులతో ఆరుట్ల సుందరయ్యనగర్ శరవేగంగా జరుగుతున్న సిసి రోడ్డు ని ర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ ప్రధానకార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీనాయకులు పరిశీలించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డిగారి సహకారంతో ఆరుట్ల గ్రా మాన్ని అన్ని విధాలుగా అన్ని మౌలిక వసతులతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయిస్తాం అనిఅ న్నారు కార్యక్రమంలో గ్రామకార్యదర్శి చిందం శ్రీశైలం ఆధ్వర్యంలో జరిగిన ఈఇబ్రహీంపట్నంమా ర్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్ మాజీ ఎంపిటిసి లాలగారి శ్రీకాంత్ ఇందిరమ్మకమిటీ సభ్యు లు బుట్టి కృష్ణముదిరాజ్ కంబాలపల్లి బుగ్గరాములు కోరే బాబు కాంగ్రెస్ పార్టీ జిల్లానాయకులు మార సురేష్ కాంగ్రెస్ నాయకులు లచ్చగారి జంగారెడ్డి పంబాల కిషోర్ మహమ్మద్ అశ్రఫ్ ఆర్ల బీరుమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ వ్యాధిగ్రస్తునికి నిత్యవసర వస్తువులు పంపిణీ



**ఖమ్మం (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం సిద్దిక్ నగర్ గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సోదరుడు నంచర్ల మల్లికార్జునచారి ఇటీవల కిడ్నీ సమస్యతో బాధపడు తుండడంతో గత నెల రోజుల క్రితం ఒక కిడ్నీ ని పూర్తిగా తీసివేయడం జరిగింది. విషయం తెలుసుకున్న కొణిజర్ల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మల్లికార్జున్ ను పరామర్శించడానికి వెళ్లి వాళ్లకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, అరకింటా బియ్యం మల్లికార్జున కుటుంబ సభ్యులకు అందజేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో కొణిజర్ల మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నెమలికొండ రామకృష్ణ చారి,దిగుట్ల లక్ష్మయ్య చారి,వేగ్గలం నాగ బ్రహ్మ చారి,సత్తేనపల్లి వీరచారి,సత్తేనపల్లి కృష్ణ చారి,గన్నవరపు రామచారి,సత్తేనపల్లి విష్ణు చారి, రంగు సత్యనారాయణచారి, నంచర్ల నరసింహ చారి,పంచాంక్షరీ వెంకట చారి, దిగుట్ల నాగ చారి,సత్తేనపల్లి కృష్ణమా చారి,సత్తేనపల్లి నాగేశ్వరరావు,కొత్తపల్లి కృష్ణ చారి, తూముల వైకుంఠ చారి, శ్రీ రామోజు వెంకట చారి,నంచర్ల నాగ చారి,సత్తేనపల్లి సంగయ్య చారి,బైరోజు ఉపేంద్ర చారి పాల్గొన్నారు.

# ఐసిఎఆర్–ఐఐఆర్ఆర్ 98వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మొక్కల పెంపకం కార్యక్రమం



**రాజేంద్రనగర్ (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్‌లోని ఐసిఎఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ (ఐసిఎఆర్–ఐఐఆర్ఆర్) యొక్క 98వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని,పర్యావరణ సుస్థిరత,వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం,జీవావరణ పరిరక్షణ పట్ల తన నిబద్ధతలో భాగంగా ఈ సంస్థ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించింది.శాస్త్రవేత్తలు,సాంకేతిక అధికారులు,పరిపాలనా సిబ్బంది,విద్యార్థులు, సహాయక సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, సంస్థ ప్రాంగణం,పరిశోధనా క్షేత్రాల అంతటా విభిన్నమైన,దేశీయ,పర్యావరణ ప్రాముఖ్యత కలిగిన మొక్కలను నాటారు.సంస్థలో పచ్చదనాన్ని పెంచడం,జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడం,కార్బన్ నిల్వను మెరుగుపరచడం,ఆరోగ్యకరమైన, మరింత సుస్థిరమైన పరిశోధనా వాతావరణాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యాలు.శాస్త్రీయ నైపుణ్యాన్ని పర్యావరణ బాధ్యతతో అనుసంధానించాలనే ఐసిఎఆర్–ఐఐఆర్ఆర్ యొక్క దార్శనికతను ఈ మొక్కల పెంపకం కార్యక్రమం ప్రతిబింబిస్తుంది.అత్యాధునిక వరి పరిశోధనను ముందుకు తీసుకెళ్లడమే కాకుండా,సుస్థిర సహజ వనరుల నిర్వహణను ప్రోత్సహించడానికి,వాతావరణ మార్పుల నివారణ,జీవావరణ పరిరక్షణపై జాతీయ ప్రయత్నాలకు తోడ్పడటానికి ఈ సంస్థ కట్టుబడి ఉంది.నాటిన ప్రతి మొక్క పర్యావరణాన్ని పరిరక్షించడానికి,వ్యవసాయ భూభాగాల స్థితిస్థాపకతను బలోపేతం చేయడానికి తీసుకున్న సామూహిక ప్రతిజ్ఞకు ప్రతీక.ఈ మొక్కల పెంపకం కార్యక్రమం,సంస్థ యొక్క 98 ఏళ్ల శాస్త్రీయ ఆవిష్కరణల వారసత్వానికి,ప్రస్తుత,భవిష్యత్ తరాల ప్రయోజనం కోసం సుస్థిర వ్యవసాయం,పర్యావరణ పరిరక్షణ పట్ల దాని నిరంతర అంకిత భావానికి తగిన నివాళి అర్పించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకతకు ప్రాధాన్యం



○ పేరేచర్లలో 'ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు సందర్శనలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మేడికొండూరు మండలంలోని దేవాదాయ శాఖ భూములకు సంబంధించిన రైతులు-దేవాదాయ శాఖ మధ్య వివాదాలను రికార్డుల ఆధారంగా పరిశీలించి ప్రత్యేక జాబితా రూపొందించి సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పేరేచర్ల పరిసర ప్రాంతాల్లో క్వారీల నిర్వహణ, ఓవర్‌లోడింగ్, అక్రమ రవాణాపై వచ్చిన ఫిర్యాదులను నిష్పాక్షికంగా విచారించి, తప్పిదాలు నిర్ధారణైతే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని నిష్పాక్షికంగా పరిశీలించి, సాధ్యమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ జిల్లాలో ఈ కార్యక్రమం ఇప్పటికే ప్రతిపాడు నియోజకవర్గంలో పూర్తైందని, తాడికొండ నియోజకవర్గంలో తాడికొండ, ఫిరంగిపురం గ్రామాల అనంతరం మూడో విడతగా పేరేచర్లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి డీపీఓ నాగసాయికుమార్, పీజీఆర్ఎస్ సమన్వయ అధికారి గంగరాజు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది సంక్షేమమే శాఖ ప్రగతికి పునాది

○ ఎస్పీ వకుల్ జిందల్

○ పోలీస్ గ్రీవెన్స్ డేలో అర్జీలు స్వీకరణ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** పోలీసు సిబ్బంది సంక్షేమమే పోలీసు శాఖ ప్రగతికి పునాదని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆయన వివిధ పోలీసు స్టేషన్లు, విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది నుంచి సేవా సంబంధిత సమస్యలు, సంక్షేమ అంశాలు, బదిలీలు, సెలవులు, వైద్య సహాయం, వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను స్వీకరించారు. ప్రతి అర్జీని స్వయంగా పరిశీలించి సమస్యల స్వభావాన్ని తెలుసుకున్నారు.

వినతులను సంబంధిత అధికారులతో సమన్వయం చేసి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సిబ్బంది సమస్యల పరిష్కారంలో పారదర్శకత, సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తూ వారి సంక్షేమం, మనోధైర్యం పెంపొందించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

## సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్‌ని పరిశీలించిన బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** వైయస్సార్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండల స్మార్ట్ కిచెన్ ని బద్వేల్ డివిజన్ ఆర్డిఓ చంద్రమోహన్ శుక్రవారం పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ కిచెన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సిబ్బందికి తెలియజేశారు ఎటువంటి లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రారెడ్డి ఎంఈఓ 1 పుల్లయ్య ఎంఈఓ 2 వెంకటేశ్వర్లు జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్మాస్టర్ ప్రతాపరెడ్డి స్మార్ట్ కిచెన్ మేనేజర్లు డిఆర్డిఏ సిబ్బంది ఉపాధ్యాయులు స్మార్ట్ కిచెన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జనతా వారధిలో భూ సమస్యపై ఫిర్యాదు



○ ఎచ్చెర్లకు చెందిన మహిళ వినతి స్వీకరించిన బీజేపీ నేతలు

**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్):** శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని బెజ్జిపురం గ్రామానికి చెందిన వి. సామ్రాజ్యం తన భూ సమస్యపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న జనతా వారధి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. వారసత్వంగా తనకు సంక్రమించిన భూమిని కొందరు ఆక్రమించారని, తనకు న్యాయం చేయాలని ఆమె వినతిపత్రం సమర్పించారు.

వి. సామ్రాజ్యం సమర్పించిన ఫిర్యాదును బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం స్వీకరించారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల మేరకు పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

# డ్వాక్రా సంఘాలు చంద్రబాబు నాయుడు మానస పుత్రికలు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ మెప్మాలో అక్రమాలు, అవినీతికి ఎలాంటి అవకాశం లేదు.

○ రుణాల మంజూరులో కమిషన్లు వసూలు చేస్తే కఠిన చర్యలు

○ డ్వాక్రా మహిళలను మోసం చేసే వారిని ఉపేక్షించం.

○ రుణాల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలి

○ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా స్పందిస్తాను

○ గుంటూరు పశ్చిమలో అవినీతి రహిత మెప్మా వ్యవస్థ లక్ష్యం.

○ డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది.



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో మహిళల ఆర్థిక సాధికారతకు పునాది వేసిన డ్వాక్రా సంఘాలు ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మానస పుత్రికలని, అలాంటి వ్యవస్థలో అవినీతి, అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు శ్రీమతి గళ్ళా మాధవి స్పష్టం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెప్మా అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, ఆర్పీలు (రిసోర్స్ పర్సన్స్)తో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సంఘాల కార్యకలాపాలు, మహిళలకు అందుతున్న రుణాలు, వాయిదాల చెల్లింపులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఎమ్మెల్యే సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...లి రాష్ట్రంలో మహిళలను స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారని, లక్షలాది మంది మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. అలాంటి గొప్ప వ్యవస్థపై ఎలాంటి మచ్చ పడకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

టీవల కొందరు డ్వాక్రా మహిళలు తన కార్యాలయానికి వచ్చి రుణాల మంజూరు, వాయిదాల చెల్లింపుల విషయంలో కొంతమంది కింది స్థాయి సిబ్బంది, మధ్యవర్తులు అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు చేశారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. రుణాలు ఇప్పిస్తామంటూ కమిషన్లు వసూలు చేయడం, మహిళల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని అన్యాయాలకు పాల్పడటం వంటి చర్యలు ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు.

డ్వాక్రా మహిళలకు అందే ప్రతి రూపాయి వారి అభివృద్ధికే వినియోగించబడాలని, రుణాల మంజూరు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. గతంలో కొనసాగిన కమిషన్ సంస్కృతికి పూర్తిగా స్వస్తి పలకాలని, మహిళలపై ఎలాంటి ఆర్థిక భారం మోపకుండా సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో "అవినీతి" అనే మాట వినిపించకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించిన ఏ సమస్య అయినా, ఎక్కడైనా అన్యాయం జరిగినా మహిళలు భయపడకుండా నేరుగా తనను సంప్రదించాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కులను కాపాడటంలో రాజీ ఉండదని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.

మెప్మా వ్యవస్థపై మహిళలకు పూర్తి విశ్వాసం కలిగేలా అధికారులు పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు.

ఈ సమావేశంలో మెప్మా అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మహిళా కళాశాల అభివృద్ధి నా బాధ్యత

○ ఇప్పటికే రూ.67 లక్షలతో మరుగుదొడ్ల నిర్మించాంమరో రూ.31 లక్షలతో క్రీడా మైదానం అభివృద్ధి

○ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , కలెక్టర్ సాయి కాంత్ వర్మకు ప్రత్యేక కృతజ్ఞతలు

○ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** సుమారు 500 మంది విద్యార్థినులు విద్యనభ్యసించే కళాశాల... కనీసం మరుగుదొడ్ల వసతి కూడా లేని దీనస్థితి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థినుల ఆత్మగౌరవాన్ని పట్టించుకోని దైన్యం. ఇలాంటి పరిస్థితిని స్వయంగా చూసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ చలించిపోయారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల సందర్శించిన ఎమ్మెల్యే నసీర్ కనీసం మౌలిక వత్తులు కల్పిస్తామని ఆనాడే హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇప్పటికే రూ. 67 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయించారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో క్రీడా మైదానం అభివృద్ధి, డ్రైనేజీల నిర్మాణానికి శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో కళాశాల ప్రతినిధులకు ఎమ్మెల్యే నసీర్ రూ. 31 లక్షల చెక్కు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ స్ఫూర్తితో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో విద్యాలయాలను మోడల్ గా తీర్చిదిద్దేందుకు నా వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. వర్షాకాలంలో కళాశాల మైదానంలో నీరు నిల్వ ఉండటంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ క్రమంలో రూ. 31 లక్షలతో క్రీడా మైదానం అభివృద్ధితోపాటు డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం చేసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారి సంకల్పంతో ప్రతి విద్యాలయాన్నీ తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్యాలయాల అభివృద్ధికి ఏ అవసరం వచ్చినా తాను ముందుంటానని స్పష్టం చేశారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , కలెక్టర్ సాయి కాంత్ వర్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో సమస్యలుంటే 24లోగా తెలియజేయండి

○ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ మయూర్ అశోక్ సమావేశం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు గడువును ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించిన నేపథ్యంలో, ప్రక్రియలో ఏవైనా సమస్యలు లేదా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో) కె. మయూర్ అశోక్ కోరారు.

శుక్రవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలోని బీఎల్ఓలు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీతో పాటు వాటి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిచేశారని తెలిపారు. నగరంలో ఎస్ఐఆర్ ప్రక్రియ దాదాపు నూరు శాతం పూర్తైందని, అధికారులు, సిబ్బంది, బీఎల్ఓలు పూర్తి పారదర్శకంగా ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారని చెప్పారు. 2002 నాటి ఓటర్ల జాబితాను ప్రస్తుత జాబితాతో క్షుణ్ణంగా పోల్చి మ్యాపింగ్ చేస్తున్నామని తెలిపారు. అలాగే ఏఎస్‌డీ (Absent, Shifted, Dead, Duplicate) జాబితాలో లేదా మ్యాపింగ్ ప్రక్రియలో ఏవైనా తప్పులు, సందేహాలు గుర్తిస్తే రాజకీయ పార్టీల ప్రతినిధులు వెంటనే తెలియజేయాలని, వాటిని తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అన్‌మ్యాప్డ్ ఓటర్ల వివరాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించి మ్యాపింగ్ పూర్తయ్యేలా సహకరించాలని కోరారు.

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 31న తొలి ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ప్రత్యేక ప్రచార ఆటోలు ఏర్పాటు చేయడంతో పాటు డివిజన్ల వారీగా హెల్ప్‌డెస్క్‌లు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్ఏల సహకారం అభినందనీయమని కమిషనర్ పేర్కొన్నారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో, అదనపు కమిషనర్ ఐ. కిషోర్, ఏఈఆర్వోలు సి. హెచ్. శ్రీనివాస్, సాంబశివరావు, డీటీలైన నాగమల్లేశ్వరరావు, సుధా కిరణ్మయి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అమరావతి భద్రతపై సెక్యూరిటీ ఆడిట్ సమావేశం

○ భద్రతా వ్యవస్థ మరింత పటిష్టానికి చర్యలు..

○ అధికారులకు ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలు



**అమరావతి/తుళ్లూరు, జూలై 17 (జర్నలిస్ట్ ఫైల్) :** నూతన రాజధాని అమరావతిలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అధ్యక్షతన శుక్రవారం తుళ్లూరు డీఎస్పీ కార్యాలయంలో సెక్యూరిటీ ఆడిట్ సమావేశం నిర్వహించారు. సచివాలయం, హైకోర్టు, ఇతర కీలక ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాలు, ప్రధాన కూడళ్లు, ప్రజా రద్దీ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయడంతో పాటు వీఐపీ, వీవీఐపీ పర్యటనలు, భవిష్యత్ భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు.

ప్రధాన రహదారులు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాల్లో వాహనాల తనిఖీలు ముమ్మరం చేయడం, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై నిరంతర నిఘా, సీసీటీవీల ద్వారా 24 గంటల పర్యవేక్షణ, ఇంటెలిజన్స్ సమాచార సేకరణ, క్విక్ రెస్పాన్స్ బృందాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచడంపై సమీక్షించారు.

ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ ప్రణాళిక, అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుతో పాటు బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సేవలను అవసరానికి అనుగుణంగా వినియోగించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా భద్రతా చర్యలు అమలు చేయడంతో పాటు పోలీసు శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అమరావతి రాజధాని ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణ, ఆస్తుల భద్రత, కీలక ప్రభుత్వ సంస్థల రక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఓఎస్‌డీ మనోజ్ రామనాథ్ హెగ్డే, అదనపు ఎస్పీ రవికుమార్, తుళ్లూరు ఎస్‌డీపీఓ మురళీకృష్ణతో పాటు వివిధ విభాగాల పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లకు పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, సి. ఆర్. డి. ఏ అదనపు కమిషనర్ ఎ. భార్గవ్ తేజతో కలిసి జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ శుక్రవారం రాజధాని అమరావతిలో గల పెరేడ్ గ్రౌండ్ ను పరిశీలించారు. ఆగష్టు 15వ తేదీన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పటిష్ట నిర్వహణకు తీసుకోవాల్సిన అంశాలను చర్చించారు.

ముఖ్య అతిథి విచ్చేసే మార్గం, ప్రధాన వేదిక ఏర్పాటు, జాతీయ జెండా ఎగురవేయుటకు ఏర్పాట్లు, న్యాయమూర్తులు, న్యాయ అధికారులు, ఉన్నత అధికారులు, ఇతర విభాగాల వ్యక్తులు కూర్చొనుటకు ఏర్పాట్లు, పోలీస్ పెరేడ్, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు, సాధారణ ప్రజానీకం వాహనాల పార్కింగ్, ప్రభుత్వ ప్రగతిని తెలియజేసే వివిధ శాఖల శకటాలు, తదితర అంశాలను పరిశీలించారు.

బందోబస్తుతో సహా సాధారణ ప్రజానీకం వచ్చే మార్గాలు రద్దీపై ఎప్పటికప్పుడు చర్యలు వంటి అంశాలను చర్చించారు. పారిశుధ్య పనులు, తాగు నీరు ఏర్పాటు అంశాలపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పెద్ద ఎత్తున చేపట్టడం జరుగుతుందని, పరిసరాలు పూర్తిగా ఆహ్లాదకర వాతావరణం కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి. ఎస్పీ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమీకరణలో రెవెన్యూ సమస్యలు పరిష్కారం కావాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని ప్రాంతంలో జూలై చివరి నాటికి రెవెన్యూ సమస్యలు పూర్తిగా పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ సి. ఆర్. డి. ఎ ఎస్. డి. సిలను ఆదేశించారు. సి. ఆర్. డి. ఎ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం భూ సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జూలై చివరి నాటికి 75 శాతం భూ సమీకరణ జరగాలని స్పష్టం చేశారు. మొదటి దశ భూ సమీకరణలో సమస్యలు ఉన్న రైతుల జాబితా సమర్పించాలని ఆదేశించారు. రైతులు సమర్పించిన అర్జీలు వెంటనే పరిష్కరించాలన్నారు. వ్యక్తిగత సమస్యలను గ్రామ సమస్యగా పరిగణించకుండా సమీకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే రాత పూర్వక నోటీసులు జారీ చేయాలని అన్నారు. జరీబు భూముల సమస్య ఉంటే వాటిని మినహాయించి మిగిలిన భూ సమీకరణకు చర్యలు చేపట్టాలని చెప్పారు. గ్రామాల్లో విస్తృత పర్యటనలు చేస్తూ సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగాలని అన్నారు. సమస్యలు అధికంగా ఉన్నట్లు భావిస్తే అటువంటి గ్రామాలపై రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో రికార్డులు పక్కాగా పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే వారం రోజులలో సమర్పించాలని కోరాలని చెప్పారు. వాటికి అనుగుణంగా రికార్డును అప్ డేట్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సి. ఆర్. డి. ఎ అదనపు కమిషనర్ లు కోలాబత్తుల కార్తీక్, ఏ. భార్గవ తేజ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాస రావు, ఎస్. డి. సిలు, తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# సకల సదుపాయాలతో మంగళగిరి అమృత్ భారత్ రైల్వే స్టేషన్ ప్రారంభం



○ నారా లోకేశ్‌తో కలిసి ప్రారంభించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**మంగళగిరి,(జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద ఆధునికీకరించిన మంగళగిరి రైల్వే స్టేషన్‌ను శుక్రవారం విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. దేశవ్యాప్తంగా పునర్నిర్మించిన అమృత్ భారత్ రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పంజాబ్‌లోని జలంధర్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించగా, మంగళగిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలు ప్రత్యక్ష ప్రసారం వీక్షించారు.

ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ప్రజలు, మహిళలు, విద్యార్థులు, యువతకు ఉపయోగపడేలా అత్యాధునిక సౌకర్యాలతో రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక కళలు, సంప్రదాయాలు, చేనేత సంస్కృతిని ప్రతిబింబించేలా స్టేషన్‌ను తీర్చిదిద్దడంతో పాటు రెండో ప్రవేశ ద్వారం, లిఫ్టులు, పార్కింగ్, ఆధునిక ప్లాట్‌ఫారాలు వంటి సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. 2014 తర్వాత కేంద్ర ప్రభుత్వం రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తూ డబుల్, ట్రిపుల్ లైన్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తోందన్నారు.

మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేశ్ నాయకత్వంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పెమ్మసాని పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పథకాలు, ఆర్ఓబీలు, నూతన ఆసుపత్రి, ఇళ్ల పట్టాల పంపిణీ వంటి అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న బి. రామాంజనేయులు మాట్లాడుతూ మంగళగిరి అభివృద్ధిలో నారా లోకేశ్ కీలక పాత్ర పోషిస్తున్నారని, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనలో ఆయన తీసుకుంటున్న చర్యలు ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని అన్నారు.

# వర్జీనియా పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు మరింత గిట్టుబాటు ధర కల్పించాలి

○ కంపెనీలతో చర్చించి ధరలు పెరిగేలా టొబాకో బోర్డు చర్యలు తీసుకోవాలి

○ 2026-27లో ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తాం

○ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో వర్జీనియా పొగాకు కొనుగోళ్లను మరింత వేగవంతం చేసి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టొబాకో బోర్డును కోరారు. శుక్రవారం పొగాకు కొనుగోళ్ల పురోగతిపై మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టొబాకో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, టొబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. విశ్వశ్రీ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రస్తుతం జరుగుతున్న ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లు, రైతులకు లభిస్తున్న ధరలు, మార్కెట్ పరిస్థితులు, కొనుగోళ్ల వేగవంతంపై విస్తృతంగా సమీక్షించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, గత నాలుగు రోజులుగా పొగాకు కొనుగోళ్లు గణనీయంగా ఊపందుకున్నాయని, ప్రస్తుతం రోజుకు సుమారు 8.5 లక్షల కిలోల పొగాకును కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం గరిష్ఠంగా కిలోకు రూ.250 వరకు ధర లభిస్తోందని, రైతులకు మరింత మెరుగైన ధర వచ్చేలా కొనుగోలు సంస్థలతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డును కోరారు. ముఖ్యంగా, పొగాకు కొనుగోలు సంస్థలపై సమర్థవంతమైన ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు ఇంకా అధిక ధర లభించేలా చర్యలు చేపట్టాలని టొబాకో బోర్డు చైర్మన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు సూచించారు. కొనుగోళ్లు మరింత వేగవంతం కావడం వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశాలు మరింత మెరుగుపడతాయని మంత్రి పేర్కొన్నారు. అలాగే, తక్కువ నాణ్యత గల పొగాకును సాగు చేసిన రైతులు కూడా నష్టపోకుండా వారికి గిట్టుబాటు ధర లభించేలా కొనుగోలు సంస్థలతో ప్రత్యేకంగా చర్చలు జరపాలని టొబాకో బోర్డు అధికారులకు మంత్రి ఆదేశించారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 2026-27 సీజన్‌లో ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేసే దిశగా వ్యవసాయ శాఖ, టొబాకో బోర్డుతో సమన్వయం చేసుకుని రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిని నియంత్రించడం ద్వారా రైతులకు స్థిరమైన గిట్టుబాటు ధరలు లభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం

# రాయపూడి పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

○ భద్రత, మౌలిక సదుపాయాలపై అధికారులకు కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు



**అమరావతి/తుళ్లూరు, జూలై 17:** ఆగస్టు 15న రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి తుళ్లూరు మండలం రాయపూడి పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సీ.ఎం. సాయికాంత్ వర్మ, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, ప్రధాన వేదిక, వీఐపీ, ప్రేక్షకుల గ్యాలరీలు, ప్రవేశ–నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, సీసీటీవీ నిఘా, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు, విపత్తు నిర్వహణ బృందాల సిద్ధతతో పాటు అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ప్రతిష్ఠకు తగిన విధంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను సురక్షితంగా, ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. పరిశీలనలో ఓఎస్డీ (అమరావతి) మనోజ్ రామనాథ్ హెగ్డే, అదనపు ఎస్పీ రవికుమార్, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్లు, ప్రోటోకాల్, పోలీసు, సీఆర్‌డీఏ, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు స్వాగతం పలికిన మంత్రి లోకేష్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్వాగతం పలికారు. పల్నాడు జిల్లా నర్సరావు పేటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మెగా రుణమేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు ముందుగా ఉండవల్లి నివాసానికి చేరుకున్న నిర్మలా సీతారామన్ కు సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి మంత్రి లోకేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ ను మంత్రి శాలువాతో సత్కరించారు.

# డాక్టర్ కొండా నాగార్జునకు చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పదోన్నతి



○ గుంటూరు సీజీహెచ్‌ఎస్‌లో ఇద్దరు సీఎంఓలు సేవలు.. కేంద్రం ఉత్తర్వులు జారీ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరులోని సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్‌లో సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కొండా నాగార్జునకు చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ)గా పదోన్నతి లభించింది. పదోన్నతితో ఆయనను గుంటూరుకే కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఆయన సీఎంఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవలే నెల్లూరు సీజీహెచ్ఎస్ నుంచి బదిలీపై వచ్చిన దాసరి రమేష్ కూడా సీఎంఓగా గుంటూరులో విధులు నిర్వహిస్తుండటంతో, సీజీహెచ్ఎస్ కేంద్రాల్లో అరుదుగా కనిపించే విధంగా గుంటూరులో ఇద్దరు చీఫ్ మెడికల్ ఆఫీసర్లు సేవలందించడం విశేషంగా మారింది. పదోన్నతి పొందిన డాక్టర్ కొండా నాగార్జునను గుంటూరు సీజీహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు గుమ్మడి సీతారామయ్య చౌదరి, కట్టా వెంకటేశ్వర్లు, ఉద్యోగులు, పెన్షనర్లు, వైద్యసిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం జిల్లాల పరిధిలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగదు రహిత సేవలు అందిస్తున్న ఎంపానెల్డ్ ఆసుపత్రులపై వస్తున్న ఫిర్యాదులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం గుంటూరు సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లో రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో అదనంగా మరో వైద్యుడిని నియమించాలని కోరుతూ లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు గుమ్మడి సీతారామయ్య చౌదరి, కట్టా వెంకటేశ్వర్లు సీఎంఓకు, సీజీహెచ్ఎస్ డైరెక్టర్ కార్యాలయానికి వినతిపత్రం సమర్పించారు. రోగుల రద్దీకి అనుగుణంగా వైద్యసిబ్బందిని పెంచితే సేవలు మరింత మెరుగుపడతాయని వారు పేర్కొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన "ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం-2026



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం--2026 శుక్రవారం విజయవాడలోని మేరిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైంది. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు మహోత్సవాన్ని ప్రారంభించి, ప్రాచీన హస్తకళల వారసత్వ పరిరక్షణతో పాటు కళాకారులకు స్థిరమైన జీవనోపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. హస్తకళాకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని, వారికి ఉచిత స్టాళ్లు, ప్రయాణ ఖర్చులు, టీఏ, డీఏ వంటి సౌకర్యాలు కల్పిస్తూ ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని తెలిపారు.

హస్తకళల అభివృద్ధికి మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, సంప్రదాయ కళలను భావితరాలకు చేరవేయడం దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఇలాంటి ప్రదర్శనలకు పెద్దగా ప్రాధాన్యం లభించలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండేళ్లలోనే ఐదుకు పైగా హస్తకళా ప్రదర్శనలు నిర్వహించడం విశేషమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హస్తకళాకారుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని చెప్పారు.

ప్రదర్శనలో దేవతా విగ్రహాలు, సంప్రదాయ కళాఖండాలు, చేనేత వస్త్రాలు, ఇతర హస్తకళా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి కొనుగోళ్లు చేసి హస్తకళాకారులను ప్రోత్సహించాలని గద్దె రామ్మోహన్ రావు పిలుపునిచ్చారు. లేపాక్షి మేనేజర్ ఎం. సురేష్ మాట్లాడుతూ, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయ కళలను సజీవంగా నిలబెట్టే ఈ నాలుగు రోజుల మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లేపాక్షి మేనేజర్ (అడ్మిన్) డిల్లీశ్వరరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# గ్రేడ్ 2 హాస్టల్ వార్డెన్లకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్

○ సర్వీస్ రూల్స్ రూపొందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు.. 300 మందికిపైగా ఉద్యోగులకు ఊరట

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బీసీ హాస్టళ్లలో పనిచేస్తున్న 300 మందికిపైగా గ్రేడ్–2 హాస్టల్ వార్డెన్లకు పదోన్నతుల మార్గం సుగమమైంది. గ్రేడ్–1 వార్డెన్లుగా పదోన్నతులు కల్పించేందుకు అవసరమైన సర్వీస్ రూల్స్‌ను రూపొందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో చాలా కాలంగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న గ్రేడ్–2 వార్డెన్లకు ఊరట లభించింది. ఏపీపీఎస్సీ ద్వారా నియమితులైన వీరికి సర్వీస్ రూల్స్ లేకపోవడంతో 2008 నుంచి పదోన్నతులు నిలిచిపోయాయి. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి సీనియార్టీని పరిగణనలోకి తీసుకుని భవిష్యత్తులో గ్రేడ్–1 వార్డెన్లుగా పదోన్నతులు కల్పించేందుకు ఈ నిబంధనలు దోహదపడనున్నాయి. సర్వీస్ రూల్స్ రూపకల్పనతో 18 ఏళ్లుగా పదోన్నతులు లేకుండా కొనసాగుతున్న ఉద్యోగులకు న్యాయం జరిగిందని గ్రేడ్–2 వార్డెన్లు హర్షం వ్యక్తం చేశారు. తమ చిరకాల సమస్యను పరిష్కరించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత–జౌళి శాఖ మంత్రి సవితకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల పదోన్నతుల సమస్యను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

# వేమూరులో 'మీకోసం'కు విశేష స్పందన



○ 60 వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

○ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** వేమూరు మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన 'మీకోసం' ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 60 మంది ప్రజల వినతులను ఒక్కొక్కటిగా పరిశీలించిన ఆయన, రెవెన్యూ, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాలు, వైద్య సేవలు, వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే చర్చించారు. అర్హమైన ప్రతి సమస్యను ప్రాధాన్యంతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ సేవలను నేరుగా ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో 'మీకోసం' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో వేమూరు మండలానికి చెందిన కూటమి ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు



○ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యేలు, నాయకులు, ప్రముఖులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను శుక్రవారం సాయంత్రం ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శాసనసభ విప్ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, గిడ్డి సత్యనారాయణ, అరవ శ్రీధర్ కూడా పవన్ కల్యాణ్‌ను కలిసి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.

అలాగే కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, గంజి చిరంజీవి, సినీ నిర్మాత నవీన్ ఎర్నేని, న్యాయవాది అశ్విన్ కుమార్, మహా న్యూస్ సీఎండీ మారెళ్ల వంశీకృష్ణ, ప్రైమ్ 9 సీఎండీ బండి రఘువీర్ శ్రీనివాస్, సీఈఓ వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు, మీడియా సంస్థల ప్రతినిధులు పవన్ కల్యాణ్‌ను కలిసి పరామర్శించి ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 'డ్రోన్ డాక్సీ' ప్రదర్శన

○ విద్యార్థుల సృజనాత్మకతకు నిదర్శనంగా భారీ డ్రోన్ రూపకల్పన

○ 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో తయారీ



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్ ):** సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా నిలుస్తున్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మరో వినూత్న విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. యూనివర్సిటీలోని స్కై వర్క్స్ (ూ౧ు ఔశీతీ౦) అంకుర సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భారీ ప్రోటోటైప్ డ్రోన్‌ను రూపొందించారు. ఈ డ్రోన్‌కు విద్యార్థులు "డాక్సీ (ణశీఞ౦)" అని పేరు పెట్టగా, శుక్రవారం యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో దీనిని విజయవంతంగా ప్రదర్శించారు.

ఈ కార్యక్రమానికి అమరావతి క్వాంటమ్ వ్యాలీ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ అధ్యక్షత వహించారు. సంప్రదాయబద్ధంగా కొబ్బరికాయ కొట్టి డ్రోన్‌ను ప్రారంభించిన అనంతరం, స్కై వర్క్స్ బృంద నాయకుడు మణికంఠ డ్రోన్ రూపకల్పన, సాంకేతిక విశేషాలను వివరించి ప్రయోగాత్మకంగా విజయవంతంగా ఎగురవేశారు.

మణికంఠ మాట్లాడుతూ, ఈ భారీ డ్రోన్‌ను 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో రూపొందించామని తెలిపారు. ఇందుకోసం 16 శక్తివంతమైన మోటార్లు, అధిక సామర్థ్యం కలిగిన బ్యాటరీలు ఉపయోగించినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈ తరహా డ్రోన్లు అత్యవసర వైద్య సేవలు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి వేగంగా వైద్య సహాయం అందించడం, అత్యవసర ఔషధాల సరఫరా, ట్రాఫిక్ రద్దీని అధిగమించి వేగవంతమైన రవాణా వంటి అనేక రంగాల్లో ఉపయోగపడతాయని వివరించారు. ముఖ్యంగా వరదలు, తుఫానులు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో చిక్కుకున్న ప్రజలను రక్షించడంలో ఇటువంటి డ్రోన్ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి స్వయంగా భారీ డ్రోన్‌ను రూపొందించడం విశేషమని అన్నారు. పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించే దిశగా యూనివర్సిటీ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసిన మణికంఠ, సాయిశంకర్, మనోజ్, దీక్షిత్, అశ్విత్, రామ్ ప్రసాద్, సంజయ్, అజిత్ కుమార్, అగస్త్య పాండేలను ప్రత్యేకంగా అభినందించారు.

క్వాంటమ్ వ్యాలీ మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ మాట్లాడుతూ, భవిష్యత్తులో నగరాల అభివృద్ధితో పాటు డ్రోన్ ఆధారిత సేవలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటాయని అన్నారు. డ్రోన్ సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని, డీజీసీఏ (ణ+జూా) నిబంధనల ప్రకారం 400 అడుగుల ఎత్తులోపే డ్రోన్లను ఎగురవేయాలని, అవసరమైన అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే సేవలు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో ఉపకులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, ముఖ్య అతిథి సీవీ శ్రీధర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ రంజిత్ థాపా, డ్రోన్ రీసెర్చ్ సెంటర్ హెడ్ ప్రద్యుత్ కుమార్ సాంకి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు మరియు విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిన ఈ 'డ్రోన్ డాక్సీ' ప్రదర్శన యూనివర్సిటీలో ఆవిష్కరణలకు మరింత ఊతమివ్వడంతో పాటు భవిష్యత్ వైమానిక సాంకేతికతకు కొత్త అవకాశాలను పరిచయం చేసింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467